# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 39 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 13 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :39 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 13 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

### స్థలాన్ని మార్చగలరేమో కానీ ప్రజాగ్రహాన్ని మార్చలేరన్న కాంగ్రెస్

- ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలం జాబితా నుంచి తొలగింపు
- ప్రభుత్వ నిర్ణయంపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు
- స్థలం మార్చగలరేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చలేరని వ్యాఖ్య
- ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, గొంతు నొక్కే ప్రయత్నమని ఆరోపణ
- ఢిల్లీలో నిరసనల కోసం రామ్‌లీలా మైదానం సహా మూడు కొత్త ప్రాంతాల గుర్తింపు

- మిగతా 2లో



## బంగాళాఖాతంలో అల్పపీడనం..

### దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన

- దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం
- రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం
- అక్టోబర్ 14 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడులో భారీ వర్షాలు
- రాయలసీమ, కేరళ, కర్ణాటకలోనూ విస్తారంగా వానలు కురిసే సూచన
- ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూల పరిస్థితులు

పెన్ పవర్ డెస్క్:దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరం వైపు కదులుతున్నందున దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి.

- మిగతా 2లో



## తిరుపతి స్వరూపం మారనుంది..

## వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన

- తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన
- టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం
- భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం

**కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.**

ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు.

**భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్**

తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది.

రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది

- మిగతా 2లో

## ఏపీ మున్సిపాలిటీల రిజర్వేషన్ల తుది జాబితా

- ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లకు తుది రూపు
- మొత్తం 106 మున్సిపాలిటీలు, 17 కార్పొరేషన్లకు తుది జాబితా విడుదల
- మున్సిపాలిటీలలో బీసీలకు 35, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 చైర్మన్ పీఠాలు
- అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు 50 స్థానాలు కేటాయింపు
- రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో ఛైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది.

- మిగతా 2లో

## 'నో' చెప్పారా.. మీ ఖాతాలో నగదు మాయం

హైదరాబాద్:పెన్ పవర్ : సైబర్ మోసాలపై హైదరా బాద్ సీపీ సజ్జనార్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. 'నో' అని ఒక్కసారి రిప్లై ఇచ్చినా ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదముం దని చెప్పారు. ఓటీపీలు చెప్పకపోయినా.. లింకులపై క్లిక్ చేయకపోయినా నగదు మాయమయ్యేలా

- మిగతా 2లో



## ప్రతి నియోజకవర్గంలో శ్రీవారి ఆలయాల నిర్మాణం

- శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఆలయాలు నిర్మించడమే లక్ష్యమన్న ఆనం

- మిగతా 2లో

- ప్రతి నియోజకవర్గంలో రూ.5 నుంచి రూ.10 కోట్లతో శ్రీవారి ఆలయం
- 6,700 ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు నెలకు రూ.10,000 జమ





## ఎల్‌ఓసీ వద్ద మందుపాతర పేలుడు: నలుగురు ఉగ్రవాదులు మృతి

- కృష్ణ ఘాటిలో మందుపాతరల పేలుడులో నలుగురు ఉగ్రవాదులు మృతి
- మృతుల్లో లష్కరే తోయిబా కమాండర్ మహమ్మద్ ఫైజాన్ ఉన్నట్లు సమాచారం
- పూంఛ్ జిల్లాలో ఎల్‌ఓసీ వెంబడి భద్రత కట్టుదిట్టం
- సత్వాల్-నాకి ప్రాంతంలోనూ పేలుడు కలకలం
- మెంధర్‌లో రెండు పాత మందుపాతరలను నిర్వీర్యం చేసిన సైన్యం

పెన్ పవర్ డెస్క్:జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) దాటి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన నలుగురు ఉగ్రవాదులు మందుపాతరల పేలుడులో మరణించారు. వీరిలో లష్కరే తోయిబా కీలక

- మిగతా 2లో

### విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు..

## నలుగురి సజీవదహనం

- విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- ప్రమాదం అనంతరం ఈవీ కారులో చెలరేగిన మంటలు
- ఘటనా స్థలంలోనే నలుగురు మృతి, మరొకరి పరిస్థితి విషమం
- నంబూరులో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన దుర్ఘటన
- మృతులు నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తింపు

- మిగతా 2లో





## ఈసీ ఫైల్స్ అన్నీ బయటపెట్టాలి

### సుప్రీంకోర్టులో ఇండియా కూటమి పిటీషన్లలోని ముఖ్యాంశాలు

పెన్ పవర్ డెస్క్:ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ లపై ఇండియా కూటమి నేతలు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. 2026 అక్టోబర్ 12న

- మిగతా 2లో

## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం



పెన్ పవర్ డెస్క్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాష్ మాథుర్ కేరళ గవర్నర్‌గా నియమితులయ్యారు.

- మిగతా 2లో

## ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026..

### రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు పురస్కారం



- స్థూల ఆర్థిక స్థిరీకరణకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై పరిశోధనకు గుర్తింపు
- స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హాల్
- వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న వుడ్‌ఫోర్డ్
- ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధాన నిర్ణయాలకు వీరి పరిశోధనలు ప్రయోనకరం
- ఆర్థిక శాస్త్ర బహుమతిని స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో ఏర్పాటు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### 2100 నాటికి మానవ వినాశనం? 17 ముప్పులను గుర్తించిన లాన్సెట్!

రాబోయే 75 ఏళ్ల కాలంలో మానవాళి మనుగడ తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉందా? శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఊహించని పురోగతి సాధిస్తున్న మనిషి, తన చేతులారా తనే వినాశనాన్ని కొనితెచ్చుకుంటున్నాడా? అంతర్జాతీయ ఆరోగ్య పరిశోధనా సంస్థ 'ది లాన్సెట్' విడుదల చేసిన నివేదిక ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. 2100 నాటికి మానవ ఉనికికే ఎసరు పెట్టే 17 ప్రధాన ముప్పులను నిపుణులు గుర్తించారు. మనిషి స్వయంగా సృష్టించుకున్న ఆ తీవ్ర ముప్పుల విశేషాలు ఏంటో ఇప్పుడు చూద్దాం..

**మనిషి కొనితెచ్చుకుంటున్న వినాశనం:**
ఒకప్పుడు ప్రకృతి వైపరీత్యాలు లేదా అంటువ్యాధుల వల్ల మాత్రమే మానవాళికి ముప్పు ఎదురయ్యేది. కానీ రాబోయే రోజుల్లో ప్రపంచానికి ఎదురయ్యే అతిపెద్ద ముప్పులు పూర్తిగా మానవ నిర్మితమేనని లాన్సెట్ కమిషన్ హెచ్చరించింది. మనిషి స్వయంగా సృష్టించుకున్న ఆధునిక సాంకేతికత, అణ్వాయుధాలు మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల చూపిస్తున్న తీవ్ర నిర్లక్ష్యమే ఈ వినాశనానికి ప్రధాన కారణాలుగా మారనున్నాయి.

**ఏఐ దుర్వినియోగం, అణు యుద్ధ భయాలు:**
కృత్రిమ మేధ సాంకేతికతను సరిగ్గా వాడుకుంటే పర్వాలేదు కానీ, దాని దుర్వినియోగం పెరిగితే కోట్లాది మంది ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని నిపుణులు చెబుతున్నారు. మరొకవైపు అణు సమరం గనుక సంభవిస్తే.. దాని వల్ల వచ్చే పొగ, ధూళి సూర్యరశ్మిని భూమికి చేరకుండా అడ్డుకుంటాయి. ఇక దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడి, పంటలు పండక ఆకలి చావులు విపరీతంగా పెరిగే ప్రమాదం ఉందని ఈ అధ్యయనం హెచ్చరించింది.

**కనిపించని ఆరోగ్య, సామాజిక సంక్షోభం:**
ఇక కేవలం అణు యుద్ధాలు లేదా ఏఐ మాత్రమే కాకుండా వాతావరణ మార్పులు, పెరిగిపోతున్న వాయు కాలుష్యం, మానసిక ఆరోగ్య సమస్యలు కూడా మానవాళిని కుంగదీస్తున్నాయి. పోషకాహార లోపం, పెరుగుతున్న ఊబకాయం, యాంటీబయోటిక్ మందులకు లొంగని బ్యాక్టీరియా.. ఈ సమస్యలు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే వీటిని నిర్లక్ష్యం చేయకూడదు.

**సమగ్ర ప్రణాళికలతోనే పరిష్కారం:**
ప్రపంచ దేశాల ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరిచి ముందస్తు ప్రణాళికలు, నివారణ చర్యలు చేపడితే ఈ ప్రమాదాలను అరికట్టవచ్చని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సైనిక బడ్జెట్లు, ఆయుధాలపై ఖర్చు చేయడం కంటే ప్రజారోగ్యం, పర్యావరణం, ఏఐ సేఫ్టీ కోసం పెట్టుబడులు పెట్టడం ముఖ్యం. ఇక 35 మంది అగ్రశ్రేణి నిపుణులతో కూడిన కమిషన్ ఈ ప్రమాదాలపై ఏటా సమీక్ష నిర్వహిస్తూ నివేదికను నవీకరించనుంది. ఇక మొత్తానికి చూస్తే, 2100 నాటికి మానవ మనుగడ సాఫీగా సాగాలంటే ఇప్పటి నుంచే మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన వినాశనానికి దారితీసే అవకాశాలను మనమే తొలగించుకోవాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, టెక్నాలజీని మంచి పనుల కోసం ఉపయోగిస్తేనే రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వగలం.

## బంగాళాఖాతంలో అల్పపీడనం..

- మొదటి పేజి తరువాయి
దీని ప్రభావంతో ముఖ్యంగా అక్టోబర్ 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 15న కూడా తీరం వెంబడి వర్షాలు కొనసాగుతాయని తెలుస్తోంది. అక్టోబర్ 16 నుంచి 19 మధ్య ఈ వర్షాలు క్రమంగా లోతట్టు ప్రాంతాలకు విస్తరించనున్నాయి. తమిళనాడులోని అంతర్గత ప్రాంతాలు, కేరళ, రాయలసీమ, దక్షిణ కర్ణాటక, కర్ణాటక తీర ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయి. కొన్ని చోట్ల పిడుగులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. తక్కువ సమయంలో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో అక్కడక్కడా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశాన్ని కొట్టిపారేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహరణ చివరి దశలో ఉన్నందున, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఈ వాతావరణ వ్యవస్థ ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి దోహదపడొచ్చని భావిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి 20 మధ్య కాలంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడనున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశం లేనప్పటికీ, గణనీయమైన వర్షపాతాన్ని ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి

## ఏపీ మున్సిపాలిటీల రిజర్వేషన్ల తుది జాబితా

- మొదటి పేజి తరువాయి
ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది. ప్రకటించిన జాబితా ప్రకారం, 106 మున్సిపాలిటీలలో ఛైర్మన్ పదవులకు గాను బీసీ (వెనుకబడిన తరగతులు) వర్గానికి 35 స్థానాలు, ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) వర్గానికి 14 స్థానాలు, ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) వర్గానికి 3 స్థానాలు కేటాయించారు. అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు మొత్తం 50 స్థానాలు రిజర్వ్ చేయడం గమనార్హం. కేటగిరీల వారీగా రిజర్వ్ చేయబడిన పురపాలక సంఘాల పూర్తి వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

**కేటగిరీల వారీగా పురపాలక సంఘాల జాబితా**
ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) – 3
ఎస్టీ – మహిళ: గూడూరు
ఎస్టీ – జనరల్: ఆత్మకూరు, ఆలూరు

**ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) – 14**
ఎస్సీ – మహిళ: కొండపల్లి, నిడదవోలు, యలమంచిలి, చింతలపూడి, సూళ్లూరుపేట, గుత్తి, చీరాల.
ఎస్సీ – జనరల్: ఉయ్యూరు, నూజివీడు, కుప్పం, సామర్లకోట, పిఠాపురం, బాపట్ల, పొదిలి.
బీసీ (వెనుకబడిన తరగతులు) – 35
బీసీ – మహిళ: జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, గుంతకల్, గుడివాడ, నందిగామ, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం.
బీసీ – జనరల్: కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, హిందూపురం, ఆత్మకూరు (నెల్లూరు), అద్దంకి, కమలాపురం, నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, నంద్యాల, బేతంచెర్ల, నందికొట్కూరు, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేల్.

**జనరల్ కేటగిరీ (మహిళ)**
ఈ కేటగిరీ కింద మొత్తం 27 మున్సిపాలిటీలను మహిళలకు కేటాయించారు.
కనిగిరి, వెంకటగిరి, నరసాపురం, పలాస–కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, బుచ్చిరెడ్డిపాలెం, యర్రగుంట్ల, యలమంచిలి, కళ్యాణదుర్గ్, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు.

**అన్‌రిజర్వ్ (జనరల్)**
కింది 26 మున్సిపాలిటీలు ఏ రిజర్వేషన్ పరిధిలోకి రాకుండా అన్‌రిజర్వ్‌గా ఉన్నాయి.
పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, సాలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, తెనాలి, రామచంద్రాపురం, సత్తెనపల్లె, శ్రీకాళహస్తి, తుని, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గ్, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిపత్రి, పిడుగురాళ్ల.
ఈ అధికారిక ప్రకటన వెలువడటంతో, మున్సిపల్ ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.
త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ రిజర్వేషన్ల ఆధారంగా ప్రధాన రాజకీయ పక్షాలు తమ వ్యూహాలకు పదునుపెట్టడం, బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు కసరత్తులు ప్రారంభించనున్నాయి. రాబోయే రోజుల్లో పురపాలక రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.

## ప్రతి నియోజకవర్గంలో శ్రీవారి ఆలయాల నిర్మాణం

రాష్ట్రవ్యాప్తంగా శ్రీవాణి ట్రస్టు ద్వారా 5,000 ఆలయాలను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు జిల్లాలో ఈరోజు జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామంలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ చేశారు.
ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ... రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఒక్కో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతి ఆలయానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 6,700 ఆలయాల్లో దూప, దీప, నైవేద్యాల కోసం అర్చకుల ఖాతాల్లో ప్రతినెలా రూ.10,000 జమ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ.35 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి ఆనం శంకుస్థాపన చేశారు. సోమశిల జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా ఆత్మకూరుకు తాగునీరు సరఫరా చేస్తున్నామని, పట్టణంలో అంబేద్కర్, షాదీ మంజిల్ భవనాలకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని ఆయన అన్నారు.

## నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ దుమారం రేగింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయం ఏకపక్షమని, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిరసన స్థలాన్ని నిర్ణయిస్తారని, ప్రభుత్వం కాదని నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం నిరసన స్థలాన్ని మార్చగలదేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని తగ్గించలేదని స్పష్టం చేశారు.
సోమవారం ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ, "ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నాం. అందుకే ప్రతిపక్షాలన్నీ కలిసి బారాఖంబా రోడ్డుకు వెళ్తున్నాం. సాధారణంగా బోట్ క్లబ్‌లో నిరసనలు జరుగుతాయి. మీరు నిరసన వేదికలను మార్చవచ్చు, కానీ ప్రజల కోపాన్ని తగ్గించలేరు" అని అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా స్పందిస్తూ, "దీన్ని ఎలా రద్దు చేస్తారు? ప్రజాస్వామ్యంలో ఎక్కడ నిరసన చేయాలో ఎవరు నిర్ణయిస్తారు? అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడానికి భారతదేశంలోని ప్రతి అంగుళం స్వేచ్ఛాయుతమైనదే. ఈ స్వేచ్ఛను మాకు రాజ్యాంగం ఇచ్చింది" అని పేర్కొన్నారు.
మరికొందరు కాంగ్రెస్ నేతలు తమదైన శైలిలో వ్యంగ్యంగా విమర్శలు గుప్పించారు. "ప్రభుత్వం ఈ దేశ పౌరులుగా మమ్మల్ని గుర్తించడం లేదు కాబట్టి, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాల్లో ఎక్కడైనా నిరసన స్థలం చూపిస్తే అక్కడికి వెళ్లి నిరసన తెలుపుతాం" అని సందీప్ దీక్షిత్ అన్నారు. హరియాణా ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా మాట్లాడుతూ.. ప్రభుత్వం భయపడిందని, ప్రజల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. "ఢిల్లీ వారి తండ్రి ఆస్తి అన్నట్లుగా.. ఇక ఢిల్లీకి రావద్దని కూడా చెబుతారు" అని ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ విమర్శించగా, "ఇకపై హిమాలయాల శిఖరాలపై నిరసన చేస్తాం" అని మరో ఎంపీ ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు.
హోం మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల కోసం నిర్దేశించిన స్థలం జాబితా నుంచి డీ-నోటిఫై చేసినట్లు ఢిల్లీ పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. నిరసనల కోసం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అనే మూడు కొత్త ప్రదేశాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం కేంద్రం, ప్రతిపక్షాల మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

## ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి 2026..
## రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు పురస్కారం

ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది.
రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి. ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా 'ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి' అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు. 2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.

## విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు.. నలుగురి సజీవదహనం

విజయవాడ నగర శివార్లలోని పశ్చిమ బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు (ఈవీ) ప్రమాదానికి గురైన వెంటనే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతులను నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తించారు. వీరంతా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ ఇళ్లకు పయనమవుతుండగా ఈ విషాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## 'నో' చెప్పారా.. మీ ఖాతాలో
## నగదు మాయం

- మొదటి పేజి తరువాయి
సరికొత్త సైబర్ మోసాలు వెలుగులోకి వస్తున్నట్లు ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. కేవలం వాట్సప్ సందేశాలతోనే, ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్‌తో కేటుగాళ్లు క్షణాల్లో సొమ్ము స్వాహా చేస్తున్నారని తెలిపారు. బ్యాంకు ఖాతా నుంచి నగదు డెబిట్ అయ్యిందంటూ గుర్తు తెలియని నంబర్ల నుంచి నకిలీ సందేశాలు పంపించి, లావాదేవీ చేయకపోతే 'నో' అని రిప్లై ఇవ్వాలని అడుగుతారని, ఆ సందేశాలకు స్పందించగానే మాల్‌వేర్ స్క్రిప్ట్‌లు యాక్టివేట్ అయ్యి.. మొబైల్ హ్యాకర్ల నియంత్రణలోకి వెళ్లే అవకాశముందని చెప్పారు. ఇటీవల చార్టర్డ్ అకౌంటెంట్ ఖాతా నుంచి రూ.లక్ష మాయమయ్యాని, అందుకే అందరూ అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే బ్యాంకు లావాదేవీల సందేశాలకు ఎస్, నో అంటూ ఎలాంటి సమాధానమివ్వొద్దని సూచించారు. ఖాతాలో నగదు తగ్గిందన్న సందేశం వస్తే.. అధికారిక బ్యాంకు యాప్‌లో స్టేట్‌మెంట్ తనిఖీ చేసుకోవాలని, ఇంకా అనుమానముంటే అధికారిక కస్టమర్ కేర్‌నే సంప్రదించాలని కోరారు. సైబర్ మోసం వల్ల డబ్బు పోగొట్టుకున్నట్లయితే 1930కి కాల్ చేయాలనీ, లేదంటే ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం

- మొదటి పేజి తరువాయి
కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తమిళనాడు గవర్నర్‌గా నియమితులయ్యారు. బ్రజ్ మోహన్ రామ్ ఒడిశా గవర్నర్‌గా నియమితులయ్యారు. డాక్టర్ సుధా యాదవ్ కర్ణాటక గవర్నర్‌గా నియమితులయ్యారు. డాక్టర్ ధల్ సింగ్ బిసెన్ ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. దుష్యంత్ గౌతమ్ సిక్కిం గవర్నర్‌గా నియమితులయ్యారు.

## ఈసీ ఫైల్స్ అన్నీ బయటపెట్టాలి

- మొదటి పేజి తరువాయి
మార్చ్ ఫర్ డెమొక్రసీ నిర్వహించిన కూటమి నేతలు.. రాహుల్ గాంధీ సహా 11 మంది సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లను సుప్రీం కోర్టు స్వీకరించింది. ఎన్నికల సంఘం, సీఈసీ జ్ఞానేష్ కుమార్, ఇతర ఇద్దరు ఎన్నికల కమిషనర్లను రెస్పాండెంట్లుగా చేర్చారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సౌగత్ రాయ్ (టీఎంసీ), అఖిలేష్ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), తేజస్వి ప్రసాద్ యాదవ్ (ఆర్‌జేడీ), సంజయ్ రౌత్ (శివసేన యూబీటీ), ఎంఏ బేబీ (సీపీఎం), డీ రాజా (సీపీఐ), మహువా మొయిత్రా... మాఝీ (జేఎంఎం), సుప్రియా సూలే (ఎన్‌సీపీ శరద్ పవార్), ఈటీ మొహమ్మద్ బషీర్ (ఐయూఎంఎల్) మొదలైన 11 మంది నేతలు పిటిన్లు దాఖలు చేశారు.

**పిటిషన్లలో ఏముంది..?**
సర్ ప్రక్రియకు సంబంధించిన అన్ని ఫైళ్లు, ఎజెండాలు, నిమిషాలు, నోటింగ్స్, అభ్యంతరాలు బయటపెట్టాలని కోరారు. జాతీయ స్థాయిలో ూ×= ప్రారంభించాలని ఎన్నికల సంఘం అధికారికంగా నిర్ణయం తీసుకున్నట్లు రికార్డులు లేవని ౹×సమాధానాల ఆధారంగా పేర్కొన్నారు. ఫారం–6ను నిబంధనలు సవరించకుండానే మార్చారని, ఇది మొదటి సారి ఓటు వేసేవారిపై అనవసర భారం వేస్తుందని విమర్శించారు.
2025 జూన్ 24 న సర్ ప్రారంభించాలని తీసుకున్న నిర్ణయంతోపాటు ఈసీనెట్, ఈఆర్ఓనెట్ యాక్సెస్ లాగ్‌లను వెల్లడించాలని కోరారు. జుజ×చీజు, జు=ాచీజు డేటాబేస్‌లు పారదర్శకంగా పనిచేయడం లేదని, ఓటరు పేర్లు తొలగించిన తర్వాత తిరిగి చేర్చే సౌకర్యం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ దశలో తొలగింపుకు గురయ్యాయని పేర్కొంటూ, అర్హులైన ఓటర్లు బయట పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
ఎన్నికల సంఘం సమష్టి అధికారాలను ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒంటరిగా వినియోగించుకున్నారని ఆరోపణ. ఇతర ఎన్నికల కమిషనర్ల అనుమతి లేకుండా నిర్ణయాలు తీసుకున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.
ఆర్టికల్ 324, 2023 చట్టం, టీఎన్ శేషన్ కేసు తీర్పు ప్రకారం నిర్ణయాలు తీసుకున్నారా అని పరిశీలించాలని కోరారు. ఎలాంటి నోటీసు లేకుండా, వాదన వినిపించుకునే అవకాశం లేకుండా ఏ ఓటరును తొలగించకూడదని డిమాండ్ చేశారు. తొలగించిన ఓటర్ల జాబితాను బూత్ వారీగా, కారణాలు, డెమోగ్రాఫిక్ వివరాలతో ప్రచురించాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో స్వతంత్ర ఆడిట్ కమిటీ ఏర్పాటు చేసి ఓటరు జాబితా మార్పులను పరిశీలించాలని కోరారు. కోర్టు తీర్పు వచ్చే వరకు సర్ ను తాత్కాలికంగా నిలిపివేయాలని పిటిషన్ లో పేర్కొన్నారు.

## తిరుపతి స్వరూపం మారనుంది..
## వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన

భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

**టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం**
దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

**మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు**
తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఎల్ఓసీ వద్ద మందుపాతర పేలుడు: నలుగురు ఉగ్రవాదులు మృతి

- మొదటి పేజి తరువాయి
కమాండర్ మహమ్మద్ ఫైజాన్ కూడా ఉన్నట్లు సమాచారం. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని నాంగి టెక్రి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేసిన మందుపాతరలు పేలడంతో నలుగురూ అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిని వకాస్, ఇస్తియాక్, ఆసిమ్‌గా గుర్తించారు. ఎల్ఓసీ వెంబడి భద్రతా బలగాలు ఇప్పటికే నిఘాను కట్టుదిట్టం చేశాయి. ఈ ఘటనతో అప్రమత్తమైన సిబ్బంది సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు, పర్యవేక్షణను మరింత పెంచారు. కృష్ణ ఘాటి సెక్టార్‌లోని సత్వాల్–నాకి ప్రాంతంలో సోమవారం జీరో లైన్ సమీపంలో పేలుడు జరిగినట్లు అంతకుముందు సమాచారం అందింది. పాకిస్థాన్ వైపు ఎల్ఓసీ వెంబడి కదులుతున్న ఓ బృందం సమీపంలో అనుమానిత ఐఈడీ పేలినట్లు అధికారులు తెలిపారు. ఆ బృందంలో చొరబాటుకు ప్రయత్నిస్తున్న ఉగ్రవాదులు ఉన్నారా? లేక గస్తీ నిర్వహిస్తున్న పాకిస్థాన్ భద్రతా సిబ్బందా? అన్నది తొలుత స్పష్టంకాలేదు. పేలుడుకు దారితీసిన పరిస్థితులపైనా అధికారులు ఆరా తీశారు. మరోవైపు, మెంధర్ సెక్టార్‌లోని బసోని ప్రాంతంలో సరిహద్దు కంచె సమీపంలో రెండు పాత మందుపాతరలను సైన్యం గుర్తించింది. రహదారి మార్గం నిర్మాణ పనుల సమయంలో సోమవారం ఉదయం 8.25 గంటలకు ఒకటి, మధ్యాహ్నం 12.10 గంటలకు మరొకటి బయటపడ్డాయి. సైనిక నిపుణులు నియంత్రిత పేలుళ్లతో వాటిని నిర్వీర్యం చేశారు. గత వారంలోనూ ఈ ప్రాంతంలో దాదాపు 12 మందుపాతరలను గుర్తించి నిర్వీర్యం చేసినట్లు సమాచారం.
ఎల్ఓసీ ప్రాంతాల్లో చొరబాట్లను అడ్డుకునేందుకు మందుపాతరలను ఏర్పాటు చేస్తుంటారు. అయితే భారీ వర్షాల కారణంగా అవి బయటపడి ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో వాటిని గుర్తించడం, భద్రతను నిరంతరం పర్యవేక్షించడం సైన్యానికి సవాలుగా మారుతోంది.

# పేదల కష్టాలు మాకు తెలుసు.. ఎప్పుడూ మీ వెంటే ఉంటాం: రమాదేవి

- నెల్లూరులో చిరు వ్యాపారులకు మంత్రి నారాయణ కుటుంబం భరోసా
- గోమతి నగర్ క్యాంప్ కార్యాలయంలో ఉచిత తోపుడు బండ్ల పంపిణీ
- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న మంత్రి నారాయణ కుటుంబం
- నియోజకవర్గంలో ఇప్పటివరకు 888 తోపుడు బండ్లు అందజేత
- పేద వీధి వ్యాపారులకు అండగా మంత్రి నారాయణ సతీమణి రమాదేవి







**నెల్లూరు అక్టోబర్ 12 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నెల్లూరు గోమతి నగర్ మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను ఉచితంగా పంపిణీ చేసి గొప్ప మానవత్వాన్ని చాటుకున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, అద్దె బండ్ల భారంతో సతమతమవుతున్న పేద వీధి వ్యాపారుల కన్నీళ్లను తుడిచేందుకు ఈ బండ్లను అందజేశారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి కష్టాలు చూసిన మంత్రి నారాయణకు పేదల ఆకలి బాధలు, ఇబ్బందులు బాగా తెలుసని రమాదేవి భావోద్వేగంతో పేర్కొన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు నియోజకవర్గంలో వివిధ విడతల్లో మొత్తం 888 తోపుడు బండ్లను పేద వ్యాపారులకు ఉచితంగా అందజేసినట్లు ఆమె వెల్లడించారు. మంత్రి నారాయణతో పాటు ఆయన కుమార్తెలు సింధు, శరణి కూడా ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారని గుర్తుచేశారు. సిటీ నియోజకవర్గంలో వీధి వ్యాపారులు, వికలాంగులు మరియు అనారోగ్యంతో బాధపడే ప్రతి పేద కుటుంబానికి మంత్రి నారాయణ కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని మరోసారి స్పష్టం చేశారు.

# శ్రీకాళహస్తిలో జనసేనకు యువత జైకొట్టు!

- పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై పార్టీలోకి యువకుల చేరికలు
- తోట గణేష్ ఆధ్వర్యంలో జనసేనలో చేరిన చియ్యవరం యువత







**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 12:**

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలువురు యువకులు జనసేన పార్టీలో చేరారు. యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలనే సంకల్పంతో పార్టీలో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది.

శ్రీకాళహస్తి పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు తోట గణేష్ ఆధ్వర్యంలో, జనసేన నాయకుడు కుప్పాల వెంకటేష్ (దుమ్ము రాయల్) సమక్షంలో తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన లోకేష్ తన మిత్రబృందంతో కలిసి జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు.

**గ్రామీణాభివృద్ధే లక్ష్యం.. ప్రజాసేవే ఆశయం!**

ఈ సందర్భంగా పార్టీలో చేరిన లోకేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'అడవి తల్లి పల్లె పండుగ 3.0' కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని అన్నారు.

పవన్ కళ్యాణ్ ఆశయాలు, జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని లోకేష్ స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని తెలిపారు.

**యువత చేరికతో పార్టీకి మరింత బలం**

జనసేన పార్టీలో చేరిన వారిలో నరసింహ, కృష్ణప్ప, శివ నాయుడు, ముని, సుబ్బు, నరసింహులు, భాస్కర్, వెంకటేష్, మునిరత్నం, రవి, మునయ్య, శ్రీను తదితరులు ఉన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి జనసేన నాయకులు, వీర మహిళలు రాజ్యలక్ష్మి, పుష్ప హృదయపూర్వకంగా స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గరిక సురేష్, ఉదయ్, దినేష్, ఓజీ వంశీ, అశోక్, వాసు తదితరులు పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యంతోప్రజాసేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ, గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని జనసేన నాయకులు పేర్కొన్నారు.

# మంగళగిరిలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జిలకు శిక్షణ తరగతులు!

- పార్టీ బలోపేతం.. ప్రజలతో మమేకం.. నాయకత్వ లక్షణాల పెంపునకు దిశానిర్దేశం!
- ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాలతో శిక్షణకు హాజరైన శ్రీకాళహస్తి నియోజకవర్గ నేతలు





**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 12:**

తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతోపాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు బాధ్యతాయుతమైన నాయకత్వ లక్షణాలను పెంపొందించేలక్ష్యంతో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర ప్రాంతీయ కార్యాలయంలో యూనిట్ స్థాయి శిక్షణతరగతులు నిర్వహించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన పలువురు యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మంగళవారం వరకు రెండు రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణ తరగతుల్లో యూనిట్ ఇన్‌చార్జిల విధులు, బాధ్యతలు, పార్టీ నిర్మాణంలో వారి పాత్ర, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించే విధానాలపై శిక్షణ ఇచ్చారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం, ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వంటి అంశాలను వివరించారు.

ఈ శిక్షణ కార్యక్రమానికి శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి నెమళ్లూరు బుజ్జి, రామకృష్ణ యాదవ్, ముని రాజా యాదవ్, ఆర్ముగం, మందల రామ్మూర్తి తదితర యూనిట్ ఇన్‌చార్జిలు హాజరయ్యారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోసమర్థవంతంగాఅమలుచేయడంతోపాటు , ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన ఆవశ్యకతను శిక్షణలో వివరించినట్లు తెలిపారు.

**చంద్రబాబు, లోకేష్ నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం**

తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దిశానిర్దేశంలో పార్టీని క్షేత్రస్థాయిలోమరింతపటిష్ఠంచేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై శిక్షణ తరగతుల్లో చర్చించినట్లు పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి అవసరమైన సమన్వయం, ప్రజలతో నిరంతర సంబంధాలు, కార్యకర్తల భాగస్వామ్యం, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాల్సిన అంశాలను వివరించారు.

**ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతాం**

శిక్షణ తరగతుల్లో పాల్గొన్న యూనిట్ ఇన్‌చార్జిలు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం తమకు విధులు, బాధ్యతలపై మరింత స్పష్టతనిచ్చిందని తెలిపారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ, పార్టీ నాయకత్వం సూచించిన మార్గంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో యూనిట్ ఇన్‌చార్జిల పాత్ర కీలకమని, క్రమశిక్షణ, సమన్వయం, ప్రజలతో నిరంతర సంబంధాల ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

# ఫార్ములా ఈ కార్ రెస్ కేసులో కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు



**ఎన్ పవర్,అక్టోబర్ 12:**

ఫార్ములా ఈ కార్ రెస్ కేసులో తన పేరును చార్జ్ షీట్ నుండి పూర్తిగా తొలగించాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ నాంపల్లి ఏసీబీ కోర్టులో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే ఏసీబీ దాఖలు చేసిన చార్జ్ షీట్‌లో కేటీఆర్ పేరును మొదటి నిందితుడిగా (ఏ1) చేర్చిన విషయం తెలిసిందే. ఈ డిశ్చార్జ్ పిటిషన్‌పై రాబోయే నవంబర్ నెలలో కోర్టు అధికారికంగా విచారణ జరపనుంది. కాగా, ఈ విచారణకు సంబంధించి ఇప్పటివరకు కేటీఆర్ రెండుసార్లు విచారణకు హాజరయ్యారని సమాచారం.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా | తిరుపతి | చిత్తూరు | వై.ఎస్.ఆర్. కడప

# శ్రీకాళహస్తిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం!

- నూతన డీఎస్పీ పావనిని మర్యాదపూర్వకంగా కలిసిన సీపీఐ నాయకులు
- మాదకద్రవ్యాల కట్టడి, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రతపై చర్చ



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 12:**

శ్రీకాళహస్తి సబ్ డివిజన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ పావనిని సీపీఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. అనంతరం శ్రీకాళహస్తి పట్టణంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాలి!**

శ్రీకాళహస్తి పట్టణంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టి, యువత భవిష్యత్తును కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు డీఎస్పీని కోరారు. మత్తు పదార్థాల ప్రభావం యువతపై పడకుండా సంబంధిత ప్రాంతాల్లో నిఘా పెంచాలని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపాలి!**

పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని నాయకులు సూచించారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

**శ్రీకాళహస్తీశ్వర స్వామి భక్తులకు మెరుగైన భద్రత కల్పించాలి!**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దర్శనానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారని నాయకులు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, భద్రతాపరమైన ఇబ్బందులు ఎదురుకాకుండా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా దేవస్థానం పరిసరాల్లో దళారీ వ్యవస్థను అరికట్టేందుకు పర్యవేక్షణ పెంచి, భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రజల భద్రతే ప్రధాన బాధ్యత**

పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, భక్తులకు రక్షణ కల్పించడం వంటి అంశాలపై సీపీఐ నాయకులు డీఎస్పీ పావనితో చర్చించారు. ప్రజలకు మెరుగైన భద్రతా సేవలు అందించడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ చొరవ తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షురాలు చారులత, రేణిగుంట మండల కార్యదర్శి వై.ఎస్. మణి, రూరల్ మండల కార్యదర్శి మించల శివకుమార్, పట్టణ కార్యదర్శి రొడ్డా గోపి, తొట్టంబేడు మండల కార్యదర్శి రుద్రపాక శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు, ఎస్టీయూ నాయకులు గుమ్మడి మురళి, గుండాల బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల కూల్చివేతలు, మహిళలుదివ్యాంగులపై దాడులు దారుణం!







- బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు
- ఎస్పీ, కలెక్టర్, ఆర్డీవో స్పందించకుంటే మహాధర్నా చేపడతాం: మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి
- నాలుగు దశాబ్దాలుగా నివాసముంటున్న పేద కుటుంబాలపై అధికారుల ప్రతాపమా?
- ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఇళ్ల కూల్చివేతలు చేపట్టారంటూ ఆగ్రహం
- దివ్యాంగుడిని, మహిళలను దురుసుగా ఈడ్చుకెళ్లడం అమానవీయమని ఆవేదన
- పోలీసుల తీరుపై తీవ్ర అభ్యంతరం.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం.. అవసరమైతే న్యాయపోరాటం: బియ్యపు

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 12:**

శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో పేద కుటుంబాలపై అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. పేదల ఇళ్లను కూల్చివేయడం, మహిళలు, దివ్యాంగుల పట్ల అమానవీయంగా వ్యవహరించడం వంటి ఘటనలను తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

**రామకృష్ణాపురంలో పేద కుటుంబాలకు అన్యాయం జరిగిందని ఆరోపణ**

రేణిగుంట మండలం, కరకంబాడి రెవెన్యూ పరిధిలోని రామకృష్ణాపురంలో సుమారు నాలుగు దశాబ్దాలుగా నివాసముంటున్న నిరుపేద కుటుంబాల ఇళ్లను రోడ్డు విస్తరణ పేరుతో ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేశారని బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతోనే అధికారులు పేదలపై అన్యాయంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

కాళ్లు లేని దివ్యాంగుడిని, మహిళలను బూట్లతో తన్నుతూ, జుట్టు పట్టుకుని రోడ్డుపై ఈడ్చుకెళ్లినట్లు వచ్చిన ఆరోపణలు అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. కనీస మానవత్వం లేకుండా బలహీన వర్గాలపై ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు ప్రజలకు అండగా నిలవాల్సింది పోయి, పేదల ఇళ్ల కూల్చివేతలకు సహకరించడం ఏమిటని ప్రశ్నించారు.

**వ్యక్తిగత కక్షలతోనే చర్యలు చేపట్టారా?**

స్థానిక టీడీపీ బూత్ కమిటీ నాయకుడు ముని కృష్ణ వ్యక్తిగత కక్షలతో, కార్ పార్కింగ్ తదితర భూ సంబంధిత ప్రయోజనాల కోసం పోలీసు, రెవెన్యూ అధికారులను ఉపయోగించుకుని ఈ చర్యలకు పాల్పడ్డారని బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సి ఉంది.

పేద కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ఇళ్ల విషయంలో చట్టపరమైన నిబంధనలు పాటించకుండా కూల్చివేతలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. బాధిత కుటుంబాల పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, వారికి జరిగిన నష్టంపై విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**ఎస్పీ, కలెక్టర్, ఆర్డీవో తక్షణమే స్పందించాలి**

ఈ ఘటనపై తిరుపతి జిల్లా ఎస్పీ, కలెక్టర్, ఆర్డీవోతో పాటు సంబంధిత రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించాలని బియ్యపు మధుసూదన్ రెడ్డి కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు, ఘటనకు బాధ్యులైన వారిపై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసుల వ్యవహారశైలిపై కూడా సమగ్ర విచారణ జరిపి, తప్పు చేసినట్లు తేలిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పేదల ఆవాసాలను తొలగించే సమయంలో చట్టపరమైన ప్రక్రియను పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు.

**న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు**

బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి, సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.పేద ప్రజల హక్కులను కాపాడటం, మహిళలు, దివ్యాంగులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార బలంతో పేదలను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలను సహించేది లేదని, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

**కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు**

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, మండల అధ్యక్షుడు గంగారి రమేష్, రహీం, దయాకర్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, రేణిగుంట మాజీ సర్పంచ్ నగేష్, మాజీ సర్పంచ్ మునిశేఖర్, అస్సన్ సాహెబ్, జాన్ బాబు, ఖాదర్, గుణశేఖర్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనంఁ నవరాత్రి పర్వదినాన అమ్మవారి మాల దీక్ష స్వీకరణ!

## స్వామివారి ఆశీస్సులతో ఆధ్యాత్మిక ఆనందంఁ అమ్మవారి సేవలో భక్తి సంకల్పం!



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 12:**

ప్రముఖ శైవక్షేత్రం, దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీకాళహస్తిలో సోమవారం భక్తిభావంతో శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా ఉందని భక్తుడు తెలిపారు.

తనకు ఎంతో ఇష్టమైన ఆ పరమశివుడిని దర్శించుకోవడం మనసుకు ప్రశాంతతను, ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించిందని పేర్కొన్నారు. స్వామివారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ తనపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు.

ఇదే క్రమంలో శరన్నవరాత్రి ఉత్సవాల పవిత్ర సందర్భంగా అమ్మవారి పట్ల తనకున్న అపారమైన భక్తి, విశ్వాసానికి ప్రతీకగా అమ్మవారి మాల దీక్షను స్వీకరించారు. అమ్మవారి ఆశీస్సులతో దీక్షను భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తూ, ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు సాగాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.

భక్తి మార్గంలో వేసే ప్రతి అడుగు మనసుకు ప్రశాంతతను అందిస్తుందని, దైవదర్శనం జీవితానికి కొత్త ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని ఈ సందర్భంగా భక్తిభావాన్ని చాటుకున్నారు.

## జనసేన సమన్వయకర్తగా సత్రవాడ ప్రవీణ్ నియామకం..

## హృదయపూర్వక అభినందనలు తెలిపిన సాయిరాం విప్పరపల్లి!

**ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలి.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 12:**

జనసేన పార్టీ శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సమన్వయకర్తగా సోదరుడు సత్రవాడ ప్రవీణ్ (రాము ప్రవీణ్) నియమితులవడం పట్ల క్రిమినల్ డిఫెన్స్ లాయర్ సాయిరాం విప్పరపల్లి హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా సాయిరాం విప్పరపల్లి మాట్లాడుతూ.. జనసేన పార్టీలో సత్రవాడ ప్రవీణ్‌కు కీలక బాధ్యతలు అప్పగించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఆయనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, ప్రజలకు మరింత చేరువ కావడంలో తనవంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. సత్రవాడ ప్రవీణ్ తన నూతన బాధ్యతల్లో అంచెలంచెలుగా ఎదుగుతూ, ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని, పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేస్తూ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు సాయిరాం విప్పరపల్లి తెలిపారు.

## మహ్మదాపురంలో రూ.2 కోట్లతో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం





**నెల్లూరు అక్టోబర్ 12 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

పొదలకూరు మండలం మహ్మదాపురంలో శాస్త్రోక్తంగా సాగిన శంకుస్థాపన మహోత్సవంలో భాగస్వాములైన రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

ప్రముఖ కాంట్రాక్టర్ పూండ్ల వెంకురెడ్డి దాతృత్వాన్ని ప్రత్యేకంగా అభినందించిన ఆనం, సోమిరెడ్డి మరో రూ.కోటి కామన్ గుడ్ ఫండ్ గా ఇచ్చి భజన మందిరం/కళ్యాణ మండపం నిర్మాణానికి ముందుకొచ్చిన పూండ్ల వెంకురెడ్డిశ్రీ వేంకటేశ్వర స్వామికి భారీ స్థాయిలో ఆలయం నిర్మిస్తున్న పూండ్ల వెంకురెడ్డికి సర్వేపల్లి నియోజకవర్గప్రజలందరితరపున కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు వారి కుటుంబానికి శ్రీవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించిన సోమిరెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు చొప్పున వెచ్చించి శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని ప్రకటించిన మంత్రి ఆనం సర్వేపల్లిలో ఆలయాల నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.14.50కోట్లు మంజూరు చేసిన ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసిన సోమిరెడ్డి,.ప్రాసెసింగ్ లో ఉన్న మరో రూ. 5 కోట్లు కూడా విడుదల చేయాలని వినతిప్రతి నియోజకవర్గంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్మించాలనే నిర్ణయం చాలా సంతోషదాయకం..ఈ బృహత్తర కార్యక్రమాన్ని సర్వేపల్లి నియోజకవర్గం వేదికగా ప్రకటించడం చాలా ఆనందంగా ఉందన్న సోమిరెడ్డి

సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో దేవాదాయశాఖకు ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక గుర్తింపు తెచ్చారని కితాబు

## స్థానిక ఎన్నికల్లో పొదలకూరు ప్రజలు సత్తా చాటాలి

**- ద్రోహం చేసిన వారికి గుణపాఠం చెప్పేందుకు సరైన సమయం ఇదే**

**- ఏ ఎన్నికల్లోనూ పొదలకూరులో నాకు మెజార్టీ రాలేదు..ఓడిపోయినప్పుడు కూడా చాలా చేశాను...మరి గెలిచిన వాళ్లు ఏం చేశారు**

**- పొదలకూరు మండల అభివృద్ధి ఎవరు చేశారో...ప్రజలు గుండెపై చేతులు వేసుకుని ఆలోచించాలి..స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులను ఓటుతో ఆశీర్వదించాలి**

**- ఏ రోజూ నాకు ఓటు వేయని తోడేరు ప్రజలపైనా నాకు కోపం లేదు...గ్రామస్తుల కోరిక మేరకు రైతులకు పట్టాల మంజూరుతో పాటు హైస్కూలులో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయిస్తా..గ్రావెల్ రోడ్డుకు నిధులు మంజూరు చేస్తాను**

**- సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**







మెటార్ సైకిల్స్ షోరూం ప్రారంభోత్సవంఈ కార్యక్రమాల్లో శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలసి పాల్గొన్న ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్.శివప్రసాద్ తదితరులు

**నెల్లూరు అక్టోబర్ 12 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

పొదలకూరు మండలం తాటిపర్తిలో పల్లె పండగ 3.0 కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన

తోడేరు పంచాయతీ రత్నగిరిలో రూ. 43.60 లక్షలతో నిర్మించిన తాగునీటి ట్యాంకు ప్రారంభోత్సవం

SEIL కంపెనీ సీఎస్ఆర్ నిధులతో రాగప్రణీత స్పీచ్ థెరపీ వారి సహకారంతో పొదలకూరులో విలువైన రూ. 10 లక్షల విలువైన వినికిడి యంత్రాల పంపిణీ పొదలకూరులో హీరో

## పంటలు వేయొద్దంటే రైతుల పరిస్థితి ఏంటి?: హరీశ్‌రావు



**అక్టోబర్ 12 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

పంటలు వేయొద్దంటే రైతుల పరిస్థితి ఏంటని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, రైతు కూలీలు ఎలా బతకాలని, వలసలు పోవాలా అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి దానికి ఎల్నినోకు లింక్ పెడుతున్నారని, బొగ్గు లేదంటే కూడా ఎల్నినో అంటున్నారు తప్ప దేవాదుల మోర్లు ఎందుకు నడవడం లేదు అని హరీశ్‌రావు నిలదీశారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లనే రాష్ట్రంలో రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు.

## పూడి గిరిజనుల భూములను స్వాధీనం చేయాలి!

**- హక్కుల కోసం పోరాటం.. తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు**

**- అధికారుల జాప్యంపై ఏపీ గిరిజన సంఘం ఆగ్రహం.. స్పందించకుంటే ఆమరణ నిరాహార దీక్షకు హెచ్చరిక**

**తొట్టంబేడు, పెన్ పవర్, అక్టోబర్ 12 :**

తరతరాలుగా వారసత్వంగా సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కల్పించి, పూడి గిరిజనులకు న్యాయం చేయాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి హరినాథ్ అధికారులను విజ్ఞప్తి చేశారు. తమకు హక్కుగా ఉన్న భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు పోరాటం చేస్తున్న గిరిజనులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

పూడి గ్రామానికి చెందిన గిరిజనులతో కలిసి ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం, ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి హరినాథ్ గిరిజనుల భూముల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ దీక్షలకు కేవీపీఎస్ నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య మద్దతు తెలిపారు.




**2.79 ఎకరాల భూమిపై హక్కులు కల్పించాలి**

ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ.. పూడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 143 నుంచి 150 వరకు ఉన్న 2.79 ఎకరాల భూమిని అక్కడి గిరిజనులు తమ తాతముత్తాతల కాలం నుంచి వారసత్వంగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే, పూడి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆ భూముల్లోకి గిరిజనులను వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమ భూముల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు దౌర్జన్యాలు, దాడులకు పాల్పడుతున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

**ఆర్డీవో ఆదేశించినా అమలులో జాప్యమెందుకు?**

భూముల సమస్య పరిష్కారం కోసం గతంలో శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విషయాన్ని హరినాథ్ గుర్తుచేశారు. అప్పట్లో స్పందించిన ఆర్డీవో, గిరిజనులకు భూములు స్వాధీనం చేయాలని తొట్టంబేడు తహశీల్దార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. అయినప్పటికీ, సంబంధిత రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు భూములను గిరిజనులకు స్వాధీనం చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారుల ఆదేశాలుకాగితాలకేపరిమితంకాకుండాక్షేత్రస్థాయిలోఅమలు కావాలని, అర్హులైన గిరిజనులకు వారి భూములపై న్యాయబద్ధమైన హక్కులు కల్పించాలని ఆయనడిమాండ్‌చేశారు.తరతరాలుగాభూములపైఆధారపడిజీవిస్తున్న గిరిజన కుటుంబాలకు న్యాయం చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు.

**న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు**

గిరిజనుల భూముల సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించి, వారికి న్యాయం చేయాలని హరినాథ్ కోరారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భూములను స్వాధీనం చేయకపోతే, ఆమరణ నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు. గిరిజనుల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, వారి హక్కులను కాపాడేందుకు జిల్లా ఉన్నతాధికారులుతక్షణచర్యలుచేపట్టాలనినిరసనకారులు డిమాండ్ చేశారు.

## నెల్లూరు నగరంలోని ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం

## పరిష్కారం దిశగా అడుగులు వేస్తాం.







**నెల్లూరు అక్టోబర్ 12 ఎన్ పవర్ నెల్లూరు బ్యూరో**

కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి, ప్రతి గ్రామానికి మంచినీటి సదుపాయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పన దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. అభివృద్ధి ప్రజలకు కనిపిస్తోందిఢ ప్రజా సంక్షేమం ముందుకు సాగుతోందని జనసేన నాయకులు కిషోర్ గురుకుల అన్నారు.

నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో 21వ (పాత 16వ) డివిజన్‌లోని రాంజీ నగర్‌లో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న జనసేనకూటమి ప్రచారం ఈరోజు కూడా యథావిధిగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ కూటమి అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

నెల్లూరు నగర అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే లిడాక్టర్ పొంగూరు నారాయణ నాయకత్వంలోలి నగర సుందరీకరణతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత లభిస్తోంది. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ నెల్లూరు నగరాన్ని మరింత సుందరంగా, ఆధునికంగాతీర్చిదిద్దే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు, మున్సిపల్ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధి, ఆధునికీకరణకు శ్రీ పొంగూరు నారాయణ చేస్తున్న కృషి ప్రశంసనీయం. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కేంద్ర ప్రభుత్వ సహకారంరాష్ట్రాభివృద్ధికిమరింతతోడ్పాటునందిస్తోంది.

ఈ నేపథ్యంలో రానున్న నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశంజనసేనబీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించి, అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టాలని జనసేన నాయకుడు లికిషోర్ గునుకుల విజ్ఞప్తి చేశారు.

ప్రచార కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, యువత, విద్యావంతులు సహా పలువురు ప్రజలను కలుసుకోగా, కూటమి అభివృద్ధి కార్యక్రమాలపై సానుకూల స్పందన లభించిందని నాయకులు తెలిపారు. నగర అభివృద్ధి కొనసాగేందుకు కూటమికి మద్దతు తెలుపుతామని పలువురు పేర్కొన్నారని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు కిషోర్ గునుకుల, జనసేన వీరమహిళ విజయలక్ష్మి గునుకుల, ప్రవల్లిక, సుప్రియ, కల్పన, కృష్ణవేణి, మడపర్తి ప్రశాంత్ గౌడ్, మల్లిరెడ్డి, నరహరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పొదలకూరు దశ, దిశ మారుస్తోన్న సోమిరెడ్డి

**- రూ.1.60 కోట్లతో పొదలకూరు టౌన్ లో సెంట్రల్ లైటింగ్**

**- శంకుస్థాపన చేసిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి**

**- డివైడర్ మొక్కల పెంపకానికి మరో రూ.30 లక్షలు మంజూరు చేస్తానన్న కోటంరెడ్డి**

**- ఏ ఎన్నికల్లోనూ పొదలకూరు మండలంలో మెజార్టీ సాధించని తాను చరిత్రలో గుర్తుండిపోయే పనులు చేస్తున్నానన్న సోమిరెడ్డి**

**- పొదలకూరు మండలానికి ద్రోహం చేసిన వారికి గుణపాఠం చెప్పేందుకు ఇదే సరైన సమయమని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటుతో సత్తా చాటాలని ప్రజలకు పిలుపు**





**నెల్లూరు అక్టోబర్ 12 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

నా సోదరుడు కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి నుడా చైర్మన్ గా సర్వేపల్లికి రూ.8.80 కోట్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ

మరో రూ.10 కోట్లు మంజూరు చేస్తానని మా శీనయ్య హామీ ఇవ్వడం సంతోషం అన్నారు.

నుడా నిధులతో అత్యంత పారదర్శకంగా పనులు జరుగుతున్నాయన్నారు.

గత ప్రభుత్వ హయాంలో రూ.26 కోట్లు నుడా నిధులు వస్తే, సవిటి కాలువలు కట్టి మురుగునీళ్లు వెనక్కిపారేలా చేశారు.

వైసీపీ నేతల అస్తవ్యస్తంగా మారిన మురుగునీటి వ్యవస్థతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పొదలకూరు మండల ప్రజలు గుండెలపై చేయివేసుకుని అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో ఆలోచించుకోవాలన్నారు.

కండలేరు ఎడమకాలువ, సోమశిల దక్షిణ కాలువ, నిమ్మ మార్కెట్, సామాజిక ఆరోగ్య కేంద్రం, డయాలసిస్ సెంటర్, ఐటీఐ, మెగా మినరల్ వాటర్ ప్లాంట్, 150 చెక్ డ్యాంల నుంచి ఈ రోజు చేపట్టిన సెంట్రల్ లైటింగ్ వరకు చేసింది..చేస్తున్నది ఎవరు

నాకు ఏ ఎన్నికల్లోనూ పొదలకూరు మండల ప్రజలు మెజార్టీ ఇవ్వకపోయినా ఇవన్నీ చేశాను

సమితి ప్రెసిడెంటు, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, మంత్రి పదవులు అనుభవించిన పెద్దమనుషులు సొంత మండలానికి ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలి నేను ఓడిపోయి చేసిన పనులను గెలిచిన నాయకులు ఎందుకు చేయలేకపోయారు

మంచి చేయకపోగా మినరల్ వాటర్ ప్లాంటును శిథిలావస్థకు చేర్చారు..దక్షిణ కాలువ పనులను అడ్డుకున్నారు..ఎడమ కాలువ లిఫ్ట్ నూ మూలనపెట్టేందుకు ఐదేళ్లూ కరెంటు బిల్లులు కట్టలేదు తోడేరు ప్రజలు ఏ రోజూ నాకు ఓటు వేయలేదు..కానీ నాకు వారిపై కోపం లేదు..

127 ఎకరాలకు సంబంధించి పట్టాలు మంజూరు చేయాలని 50 మంది రైతులు కోరారు..వారికి పట్టాలు ఇప్పించే బాధ్యత నాదేతోడేరు హైస్కూలులో వాటర్ ప్లాంటు అడిగారు..గ్రావెల్ మంజూరు చేయాలని కోరారు. అన్నీ పనులను చేస్తానుఓటు వేసిన వారిని, వేయని వారిని ఒకే రకంగా చూస్తా..రాజకీయాలకు అతీతంగా పనిచేస్తా రేపు జరగబోతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పొదలకూరు ప్రజలు సత్తా చాటాలి...పని చేసిన వారికి ఓటు వేసి ఆశీర్వదిస్తారని నిరూపించాలి అక్రమాలు, దోపిడీలకు పాల్పడిన వారిని ఓటు వేయరని చాటి చెప్పాలి గెలిచినా, ఓడినా ప్రజల కోసమే బతికే నాయకుడిని నేను...ఏ రోజూ డబ్బు కోసం బతకలేదు పొదలకూరు మండలానికి ద్రోహం చేసిన వారికి గుణపాఠం చెప్పేందుకు ఇదే సరైన సమయమన్నారు. అనంతరం

కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ

మా చిన్నతనం నుంచి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రాజకీయాలు, పోరాటాలను చూస్తూ పెరిగాం

వ్యవసాయ శాఖ మంత్రి ఎలా పనిచేయాలో చేసి చూపించిన రైతు బాంధవుడు ఇరిగేషన్ వ్యవస్థపై సంపూర్ణ అవగాహన కలిగిన నాయకుడు సోమిరెడ్డి

కోరిన వెంటనే పొదలకూరు ప్రజలకు సెంట్రల్ లైటింగ్ హామీని ఇచ్చాం..ఈ రోజు నెరవేరుస్తున్నాం

డివైడర్ ఏర్పాటుతో పాటు మొక్కల పెంపకంతో అందమైనపొదలకూరుగారూపుదిద్దుకుంటుంది..అందుకు అవసరైన మరో రూ.30 లక్షలు మంజూరు చేస్తా

ఈ బృహత్తర కార్యక్రమానికి వ్యాపారులందరూ సహకరించాలని కోరుతున్నా...పొదలకూరు రూపు మారుతుంది..స్థలాల విలువ కూడా భారీగా పెరుగుతుందిఈ ప్రాంతం నుంచి ఎందరో నాయకులు ఎమ్మెల్యేలు,మంత్రులయ్యారు...కానీపొదలకూరునుమరిచిపోయారు నేను ఎవరినీ విమర్శించడం లేదు..ఈ ప్రాంతాన్ని విస్మరించిన వారి బాధ్యతను గుర్తు చేస్తున్నాను నెల్లూరు ట్రంకురోడ్డు తరహాలో ఉన్న పొదలకూరు మెయిన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పెట్టాలని ఎందుకు ఆలోచించలేదు

గత ప్రభుత్వంలో నుడా నిధులు రూ.26 కోట్లు తీసుకున్నారే..సెంట్రల్ లైటింగ్ కు రూ.1.50 కోట్లు ఖర్చుపెట్టలేకపోయారా

రాజకీయాలు శాశ్వతం కాదు..మనం చేసే మంచి పనులే శాశ్వతం కూటమి ప్రభుత్వంతో పాటు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేస్తున్న మంచిని చూసి ఓటుతో ఆశీర్వదించాలని పని పాట లేని తూత్ మాలిష్ ప్రతిపక్షాన్ని స్థానిక ఎన్నికల్లోనూ తరిమికొట్టాలని ప్రజలను కోరుతున్నా

# కూటమి ప్రభుత్వంలో సరికొత్త 'చెత్త' కుంభకోణం..

- లెగసీ వేస్ట్ పేరుతో ఏకంగా రూ.1,200 కోట్ల ప్రజాధనం దోపిడీ :
- ఆధారాలతో సహా బయటపెట్టిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్ రెడ్డి
- తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ పి చంద్రశేఖర్ రెడ్డి.
- ఎన్జీటీకే పచ్చి అబద్ధాల అఫిడవిట్లు సమర్పించిన చంద్రబాబు ప్రభుత్వం..
- రూ.1,200 కోట్ల స్కామ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం : ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి స్పష్టీకరణ
- అమరావతి భూముల నుంచి మున్సిపాలిటీల్లోని చెత్త వరకు అంతా లూటీయే..
- ఐదు నెలల్లోనే చెత్త లెక్కలు రెట్టింపు చేసి అడ్డగోలు బిల్లులు.
- చెత్త కుంభకోణంపై తక్షణమే స్వతంత్ర విచారణ జరపాలి. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్.





**నెల్లూరు అక్టోబర్ 12 పెన్ పవర్ స్టేట్ బ్యూరో**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇసుక, మద్యం, గ్రావెల్, రేషన్ బియ్యం మాఫియాల రూపంలో సాగుతున్న దోపిడీ ఇప్పుడు చివరికి మున్సిపాలిటీల్లోని చెత్త వరకు చేరిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా రూ. 1,200 కోట్లకు పైగా విలువైన భారీ కుంభకోణానికి తెరలేపిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో క్లియర్ చేసిన చెత్తను కూడా మళ్లీ రికార్డుల్లో చూపిస్తూ, కేవలం ఐదు నెలల వ్యవధిలోనే లెగసీ చెత్త పరిమాణాన్ని అమాంతం రెట్టింపు చేసి తప్పుడు లెక్కలతో వందల కోట్ల దొంగ బిల్లులు కాజేస్తున్నారని ఆధారాలతో సహా బయటపెట్టారు. చెత్తకుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని.. దీనిపై కచ్చితంగా స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా ఏమన్నారంటే...**

చెత్తనూ వదలకుండా రూ. 1,200 కోట్ల దోపిడీ స్కెచ్! రాష్ట్రంలో చంద్రబాబు పాలనను గమనిస్తే ఒక్కటే లక్ష్యం కనిపిస్తోంది. ఎక్కడ చూసినా దోపిడీ, దోపిడీ, దోపిడీయే. అమరావతి భూములు, పీపీపీ పేరుతో ప్రభుత్వ ఆస్తుల ధారాదత్తం, ఇసుక, గ్రావెల్, మద్యం, రేషన్ బియ్యం మాఫియాల తర్వాత ఇప్పుడు చివరికి మున్సిపాలిటీల్లోని చెత్తను కూడా వదలకుండా దోచుకుంటున్నారు. చరిత్రలో ఎన్నడూ చూడని రీతిలో లెగసీ వేస్ట్ పేరుతో భారీ కుంభకోణానికి పాల్పడుతున్నారు. ఒక్క టన్ను చెత్తను ప్రాసెస్ చేయడానికి ఏకంగా రూ. 800 చొప్పున క్లెయిమ్ చేస్తూ, కోటి 63 లక్షల టన్నుల వరకు లెక్కలు పెంచి దాదాపు రూ. 1,200 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు పక్కా స్కెచ్ వేశారు.

**5 నెలల్లోనే చెత్త రెట్టింపు ఎలా అయింది ?..**

2024 మార్చి, సెప్టెంబర్ నెలల్లో మంత్రి నారాయణ స్వయంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 85 లక్షల టన్నుల లెగసీ చెత్త ఉందని చెప్పారు. 2 అక్టోబర్ , 2025 నాటికి మొత్తం క్లియర్ చేస్తామన్నారు. కానీ 2026 ఫిబ్రవరి నాటికి వచ్చేసరికి కేవలం ఐదు నెలల వ్యవధిలోనే ఆ లెక్కను అమాంతం కోటి 53 లక్షల టన్నులకు, ఆ తర్వాత కోటి 62 లక్షల టన్నులకు ఎలా పెంచారు? ఐదు నెలల్లో చెత్త పరిమాణం దాదాపు రెట్టింపు ఎలా అవుతుందో ముఖ్యమంత్రి చంద్రబాబు, పురపాలక శాఖ మంత్రి నారాయణ సమాధానం చెప్పాలి. ముఖ్యమంత్రి, మంత్రి చెప్పే లెక్కలకు కనీస పొంతన లేదు.

**ఎన్జీటీకి సమర్పించిన అఫిడవిట్లలోనే పచ్చి అబద్ధాలు!..**

రాజ్యాంగబద్ధమైన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (NGT)కు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ సంతకాలతో సమర్పించిన ఐదు అఫిడవిట్లలో పరస్పర విరుద్ధమైన లెక్కలు, పచ్చి అబద్ధాలు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో ఇప్పటికే 100 శాతం తొలగించామని చెప్పిన చెత్తను, మళ్లీ కొత్తగా రికార్డుల్లో చూపిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు:

కడప : మొదటి అఫిడవిట్‌లో 1.08 లక్షల టన్నుల చెత్త ఉందని, 100% తొలగించామని, 20 ఎకరాల డంపింగ్ యార్డ్ ల్యాండ్‌ను రీక్లెయిమ్ చేశామని చెప్పారు. ఐదు నెలల తర్వాత అదే చెత్తను 8.41 లక్షల టన్నులకు పెంచారు. రోజుకు 156 టన్నుల తాజా చెత్త మాత్రమే వచ్చే కడపలో 800 శాతం చెత్త ఎలా పెరిగింది?

అనంతపురం : 3.32 లక్షల టన్నుల చెత్త 100% క్లియర్ అయిపోయిందని, 12 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పి, మళ్లీ 7.10 లక్షల టన్నుల చెత్త ఉందని లెక్కలు చూపించారు.

తిరుపతి : 2.04 లక్షల టన్నులు పూర్తిగా తొలగించామని చెప్పి, తర్వాతి అఫిడవిట్లలో దాన్ని 7.42 లక్షల టన్నులకు పెంచారు.

కుప్పం : ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే కుప్పంలో 2,555 టన్నులు క్లియర్ చేశామని అఫిడవిట్ ఇచ్చి, ఐదు నెలల్లో దాన్ని ఏకంగా 35 వేల టన్నులకు పెంచారు. కుప్పాన్ని కూడా దోపిడీకి వదలలేదు.

తాడేపల్లిగూడెం, ప్రొద్దుటూరు : తాడేపల్లిగూడెంలో 14 వేల టన్నులు క్లియర్ అయ్యాక మళ్లీ 1.32 లక్షల టన్నులు చూపించారు. ప్రొద్దుటూరులో 57 వేల టన్నులను 4.04 లక్షల టన్నులకు పెంచారు.

రాజమహేంద్రవరం : 5.11 లక్షల టన్నుల చెత్త క్లియర్ చేశామని ఒక అఫిడవిట్‌లో బిల్లులు పెట్టి.. మరో అఫిడవిట్‌లో అసలు ఉన్న చెత్తే 2.78 లక్షల టన్నులని రాశారు. ఉన్నదానికంటే డబుల్ క్లియర్ చేశామని బిల్లులు ఎలా పెడతారు?

విశాఖపట్నం : విశాఖలో వేస్ట్ టు ఎనర్జీ (WTE) ప్లాంట్ ఉంది, తాజా చెత్త నిల్వ ఉండదు. గతంలో 9.60 లక్షల టన్నులు క్లియర్ అయిపోయిందని చెప్పి, ఇప్పుడు 17.84 లక్షల టన్నుల చెత్త ఉందని చూపించారు.

జైపూర్ డార్క్ రూమ్ ఆపరేషన్స్.. అనుమతులు లేని టెండర్లు !

ఎటువంటి పరిపాలనా అనుమతులు (అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్) లేకుండానే వందల కోట్ల విలువైన చెత్త టెండర్లను తమ బినామీలకు కట్టబెట్టారు. 2025 మార్చిలో రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఒక ప్రైవేట్ భవనంలో 'డార్క్ రూమ్ ఆపరేషన్స్' నడిపి, రహస్య సమావేశాల్లో కాంట్రాక్టులు ఖరారు చేసుకున్నారు. స్థానికంగా టెండర్లలో పాల్గొనడానికి వచ్చిన ఇతర కాంట్రాక్టర్లను 'విజిలెన్స్ విచారణలు చేయిస్తాం, బిల్లులు రావు' అని బెదిరించి పక్కకు తప్పించారు. అక్టోబర్ 2, 2025 నాటికి పని పూర్తి చేయకపోతే టెండర్ నిబంధనల ప్రకారం 20% బిల్లుల్లో కోత విధించాల్సింది పోయి, బినామీలకు దోచిపెడుతున్నారు.

ప్రాసెసింగ్ చేయకుండా నిప్పంటించి ప్రజారోగ్యంతో చెలగాటం!

టన్నుకు రూ. 800 చొప్పున బిల్లులు క్లెయిమ్ చేస్తున్న కూటమి నేతలు.. వాస్తవానికి డంపింగ్ యార్డుల్లో చెత్తను ప్రాసెస్ చేయకుండా నేరుగా నిప్పంటిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా మున్సిపాలిటీల డంపింగ్ యార్డుల్లో ప్లాస్టిక్, లీషెట్ వ్యర్థాలను తగలబెడుతున్న దృశ్యాలు లాంగిట్యూడ్, లాటిట్యూడ్ వివరాలతో సహా మా వద్ద ఉన్నాయి. చెత్తను తగలబెట్టడం వల్ల డయాక్సిన్లు, ఫ్యూరాన్లు, బెంజీన్, పీఎం 2.5 వంటి ప్రమాదకర వాయువులు వెలువడి సమీప ప్రజలు క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రజారోగ్యంతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది. ఇప్పటికీ క్షేత్రస్థాయిలో 70 లక్షల టన్నుల చెత్త గుట్టలుగా పేరుకుపోయి దర్శనమిస్తోంది.

పారిశుద్ధ్య విప్లవం తెచ్చింది వైఎస్ జగన్ ప్రభుత్వమే!

రాష్ట్ర చరిత్రలో దశాబ్దాలుగా పేరుకుపోయిన లెగసీ వేస్ట్ సమస్యను గుర్తించి, 2021లోనే 'క్లాప్' (CLAP Clean Andhra Pradesh) ప్రోగ్రామ్ ద్వారా పారిశుద్ధ్య విప్లవానికి నాంది పలికింది వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే 41 లక్షల టన్నులకు పైగా లెగసీ చెత్తను తొలగించినట్లు కూటమి ప్రభుత్వం ఇచ్చిన తొలి అఫిడవిట్ సాక్షిగానే స్పష్టమైంది. 1.2 కోట్ల ఉచిత డస్ట్ బిన్లు, జీపీఎస్ ట్రాకింగ్‌తో కూడిన 4,097 గార్బేజ్ ఆటోలు, వేలాది టిప్పర్లు ఇచ్చి డోర్ టు డోర్ కలెక్షన్ విధానాన్ని తీసుకొచ్చింది వైఎస్ జగన్ ప్రభుత్వమే. గతంలో చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు, నారాయణ 5 ఏళ్లు మంత్రిగా ఉన్నప్పుడు ఈ చెత్త కుప్పలు గుర్తుకురాలేదా? వైఎస్సార్‌సీపీ చేసిన పనులను సిగ్గులేకుండా తమ ఖాతాలో వేసుకుంటూ చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారు.

**కమిషన్ల కోసమే ప్రాసెసింగ్ యూనిట్లు, డబ్ల్యూటీఈ ప్లాంట్లు !**

రాష్ట్రంలో రోజుకు ఉత్పత్తయ్యే మొత్తం తాజా చెత్త 6,890 టన్నులు. అందులో ఇప్పటికే విశాఖ, గుంటూరు డబ్ల్యూటీఈ ప్లాంట్లలో 2,800 టన్నులు ప్రాసెస్ అవుతోంది. మిగిలిన 4,000 టన్నుల తాజా చెత్త కోసం రూ. 600 కోట్లతో 107 ప్రాసెసింగ్ యూనిట్లు ఎవరి కమిషన్ల కోసం పెడుతున్నారు? మళ్లీ సమాంతరంగా వేల కోట్ల వ్యయంతో PPP పేరుతో 6 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు తెచ్చి, 30 శాతం వయబిలిటీ గ్యాప్ ఫండ్ మింగేయాలని చూస్తున్నారు. ఉండేదే 4 వేల టన్నుల చెత్త అయితే.. ప్రాసెసింగ్ యూనిట్లకు ఎక్కడి నుంచి తెస్తారు, ప్లాంట్లకు ఎక్కడి నుంచి తెస్తారు?

**ఎన్జీటీకి, కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఆధారాలతో సహా ఫిర్యాదు !**

ప్రధానంగా స్వయంగా చీఫ్ సెక్రటరీ సంతకాలతో కూడిన అఫిడవిట్ల ద్వారా రాజ్యాంగబద్ధమైన నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (NGT)ను సైతం కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని చంద్రశేఖర్ రెడ్డి ఆక్షేపించారు. ప్రభుత్వం అధికారుల ద్వారా సమర్పించిన తప్పుడు లెక్కలు, ఫోటోలు, వీడియోలు, జియో కోఆర్డినేట్స్ అన్ని ఆధారాలనూ తీసుకుని ఎన్జీటీతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న ఈ రూ. 1,200 కోట్ల చెత్త కుంభకోణంపై తక్షణమే స్వతంత్ర దర్యాప్తు జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# స్థానిక సమరంలో జనసేన సత్తా చాటుదాం!

- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధిస్తాం
- జనసేన కో-ఆర్డినేషన్ కమిటీ సమన్వయకర్త సత్రవాడ ప్రవీణ్ ధీమా



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 12:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన పార్టీ సత్తా చాటుతూ, పార్టీ అభ్యర్థులను 100 శాతం స్ట్రైక్ రేట్‌తో గెలిపించి పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు విజయాన్ని కానుకగా అందిస్తామని జనసేన పార్టీ నాయకుడు, శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సమన్వయకర్త సత్రవాడ ప్రవీణ్ ధీమా వ్యక్తం చేశారు.

జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తనపై నమ్మకం ఉంచి శ్రీకాళహస్తి నియోజకవర్గ స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించినందుకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి, విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

తనతో పాటు కో-ఆర్డినేషన్ కమిటీ సమన్వయకర్తలుగా నియమితులైన కోట్టె సాయి ప్రసాద్, దండి నరేంద్రతో పాటు నిర్వాహక దళ్ సభ్యులకు, సపోర్ట్ టీమ్ సభ్యులకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఐకమత్యమే విజయానికి పునాది!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని జనసేన పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు సమష్టిగా ముందుకు సాగాలని సత్రవాడ ప్రవీణ్ పిలుపునిచ్చారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూ, ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

స్థానిక ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించి, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు విజయాన్ని కానుకగా అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

# శరన్నవరాత్రి రెండో రోజు వైభవంగా అమ్మవారి అలంకరణ
## శ్రీ దీక్షా భైరవి దేవిగా దర్శనమిస్తున్న జగన్మాత

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 12:**

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు శ్రీ దీక్షా భైరవి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. సర్వశక్తి స్వరూపిణిగా, భక్తుల పాలిట కల్పవల్లిగా కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తున్నారు.

జగన్మాత దివ్యరూపాన్ని దర్శించుకోవడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని, మానసిక ప్రశాంతతను అందిస్తుంది. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ప్రసరించి, సకల శుభాలు కలగాలని భక్తులు కోరుకుంటున్నారు.

ఆదిపరాశక్తి అనుగ్రహంతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు, సకల విజయాలు సిద్ధించాలని ప్రార్థిద్దాం. లోకమంతా సుఖశాంతులతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆ జగన్మాతను వేడుకుందాం.



# జనసేన స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీలో వంశీ యాదవ్‌కు చోటు!
## పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తా వంశీ యాదవ్

**ఏర్పేడు,పెన్ పవర్,అక్టోబర్ 12:**

జనసేన పార్టీ శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ జాబితాలో ఏర్పేడు మండలానికి చెందిన జనసేన నాయకుడు వంశీ యాదవ్‌కు 17వ స్థానం లభించింది. ఈ సందర్భంగా ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, తనపై నమ్మకం ఉంచి కమిటీలో చోటు కల్పించిన పార్టీ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు మరింత అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలే తనకు స్ఫూర్తి అని వంశీ యాదవ్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, సామాన్య ప్రజలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతానని తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే రాజకీయాల ప్రధాన ఉద్దేశమని, ఆ దిశగా పార్టీ నాయకత్వం చూపుతున్న మార్గంలో నడుస్తానని వెల్లడించారు.

స్థానిక ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీలో తనకు అవకాశం కల్పించడం బాధ్యతను మరింత పెంచిందని వంశీ యాదవ్ అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ స్థానికంగా జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.




యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజాసేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పదవులు, బాధ్యతలు అనేవి వ్యక్తిగత గుర్తింపు కోసం కాకుండా ప్రజలకు మరింత చేరువై సేవ చేసేందుకు లభించే అవకాశాలని అభిప్రాయపడ్డారు. పార్టీ అప్పగించే ప్రతి బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, జనసేన పార్టీ ఆశయ సాధనకు కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. తనకు సహకరిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు వంశీ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ బలోపేతమే లక్ష్యంగా, ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగుతానని వంశీ యాదవ్ స్పష్టం చేశారు.

# కనకాచలంపై భవాని దీక్షా మాల ధరించిన మాజీ ఎమ్మెల్యే కుమార్తె పవిత్ర రెడ్డి
## దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజల అనంతరం భవాని దీక్ష స్వీకరణ





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 12:**

దేవీ శరన్నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకుని, ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలోని కనకాచలంపై కొలువుదీరిన శ్రీ దుర్గమ్మ తల్లి సన్నిధానంలో మాజీ ఎమ్మెల్యే శ్రీ బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె శ్రీమతి కాటంరెడ్డి శ్రీ పవిత్ర రెడ్డి బియ్యపు భక్తిశ్రద్ధలతో భవాని దీక్షా మాల ధరించారు.

ఈ సందర్భంగా ముందుగా దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందిన అనంతరం పవిత్ర రెడ్డి భవాని దీక్షా మాలను స్వీకరించారు. అమ్మవారి పట్ల భక్తిని చాటుకుంటూ, ఆధ్యాత్మిక నియమ నిష్ఠలతో దీక్ష చేపట్టడం విశేషంగా నిలిచింది.దేవీ శరన్నవరాత్రుల వేళ అమ్మవారి సన్నిధిలో భవాని దీక్ష స్వీకరించడం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైనదని భక్తులు పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ బోర్డు సభ్యులు మున్నా రాయల్, జయ శ్యామ్ రాయల్, కంచి గురవయ్య, అప్పిని సుధాకర్, మైలాపూర్ లోకేష్, కార్తీక్ యాదవ్, మహమ్మద్, ఆనంద్, మునీర్, సూర్య, రవి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు
## శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్





**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,12:**

పట్టణ అభివృద్ధిలో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం కింద గూడూరు పట్టణ పరిధిలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ. 30 కోట్ల నిధులు మంజూరు చేసిందని గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శిలాఫలకాన్ని ప్రారంభించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గూడూరు పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ వివిధ అభివృద్ధి పనులను చేపడుతోందని పేర్కొన్నారు. రూ. 30 కోట్ల నిధులతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

అధికారంలోకి వచ్చిన అనంతరం పట్టణంలో రూ. 75 లక్షల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని, రూ. 1.27 కోట్లతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మించామని తెలిపారు. అలాగే రూ.కోటి వ్యయంతో మార్కెట్ నిర్మాణ పనులను పూర్తి చేసి వ్యాపారులకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. రూ. 84 లక్షలతో పట్టణంలోని అన్ని వార్డుల్లో డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు వివరించారు.

అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్ (SBM) 2.0 పథకాల నిధులతో తాగునీటి సరఫరా, డ్రైనేజీలు, పైప్‌లైన్ మరమ్మతులు, జీఆర్పీ పైప్‌లైన్ మార్పు, చెరువుల అభివృద్ధి తదితర పనుల కోసం దాదాపు రూ. 194.32 కోట్లతో వివిధ పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో గూడూరు మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధిని, ప్రస్తుతం చేపడుతున్న పనులను ప్రజలు గమనించాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి తమ నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.

# నూతన ఈవో చిట్టిబాబును మర్యాదపూర్వకంగా కలిసిన పేపళ్ల అమరయ్య నాయుడుదేవస్థాన అభివృద్ధి,భక్తులకు మెరుగైన దర్శన ఏర్పాట్లపై చర్చ



**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,12:**

గూడూరు పట్టణంలోని పలు దేవాలయాలకు దేవాదాయ శాఖ అధికారిగా (ఈవో) నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చిట్టిబాబును శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు పేపళ్ల అమరయ్య నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవస్థాన అభివృద్ధి, ఆలయంలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు, రాబోయే పర్వదినాల్లో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఈవోతో చర్చించారు.ఈ సందర్భంగా పేపళ్ల అమరయ్య నాయుడు మాట్లాడుతూ.. దేవస్థానంలో పనిచేస్తున్న అర్చకులు, స్వీపర్లకు చెల్లించాల్సిన జీతాల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ సహకారంతో దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఈవోను విజ్ఞప్తి చేశారు.రాబోయే డిసెంబర్ నెలలో జరిగే ముక్కోటి ఏకాదశి, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్వామివారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడంతో పాటు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ధర్మకర్తల మండలి తరఫున ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని పేపళ్ల అమరయ్య నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానానికి సంబంధించిన పలు ఇతర అంశాలపై కూడా ఈవో చిట్టిబాబుతో చర్చించారు.

## రాయలచెరువు నిర్వాసిత బాధ్యులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు..

## భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి పాదర్తి. రాజారెడ్డి



**సూళ్లూరుపేట, పెన్ పవర్, అక్టోబర్ 12**

తిరుపతి జిల్లా, కే వి బి పురం మండలంలోని రాయల చెరువు నిర్వాసిత బాధ్యత రైతులు సోమవారం తాసిల్దార్ కార్యాలయం వద్ద తిరుపతి జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రాయల చెరువు నిర్వాసిత బాధ్యత రైతులను కలుపుకొని ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ రాష్ట్ర కార్యదర్శి మరియు తిరపతి జిల్లా ఇన్చార్జ్ పాదర్తి, రాజారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాయల చెరువుకు గండిపడి, పంటలు పొలాలు దెబ్బతిని, ఇసుక మేటలు పడి, బండ రాళ్లు పడి రైతులు తీవ్రంగా నష్టపోతే 11 నెలలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు రైతుల ఖాతాలో ఒక్క రూపాయి కూడా జమ కాలేదని గతంలో ఒకసారి భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగిందని ఇదే విషయమై మూడుసార్లు కలెక్టర్ని కలవడం జరిగింది.అని గత నెల 19వ తేదీన కలెక్టర్ ని రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని సాంకేతిక కారణాల వల్ల ఆగిందని చెప్పడం జరిగింది . అయినప్పటికీ ఇప్పటికీ పరిష్కారం కాలేదని అందువల్లనే ఈరోజు ధర్నా నిర్వహించవలసి వచ్చిందని అన్నారు.జూన్ 26వ తేదీన జిల్లా వ్యవసాయ అధికారి, స్థానిక శాసనసభ్యులు రైతులకు చెక్కులు పంపిణీ చేస్తామని చెప్పి రెండు రోజులలో అందరి రైతు ఖాతాలోకి నగదు జమవుతాయని చెప్పడం జరిగింది.అయినప్పటికీ పరిష్కారం కాలేదని ప్రభుత్వ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు మరోసారి చొరవ తీసుకుని ఎలాంటి పొరపాట్లు జరగకుండా న్యాయబద్ధంగా రైతులకు రావలసిన ఇన్పుట్ సబ్సిడీ నష్టపరిహారాన్ని వెంటనే వచ్చేటట్లు ప్రయత్నం చేసి రైతులకు న్యాయం చేయాలని రాజారెడ్డి కోరడం జరిగింది. గండి పడిన చెరువుకు ఇరిగేషన్ అధికారులు వెంటనే చొరవ తీసుకుని శాశ్వత పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని ఇప్పటికే రెండుసార్లు పంట పెట్టుకునే అవకాశం రైతులు కోల్పోయారని ఇది గమనించి అధికారులు వర్షాలు ప్రారంభం కాకముందే శీఘ్రంగా పనులు చేపట్టాలని రాజారెడ్డి డిమాండ్ చేశారు. చెరువు కింద నిర్వాసిత బాధ్యత రైతులు బ్యాంకుల్లో తెచ్చుకున్న బకాయిలను వెంటనే రద్దు చేయాలని వారు కోరడం జరిగింది.ఈ సమస్యలు పరిష్కరించకపోతే మరోసారి రైతులు కలుపుకొని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పాదర్తి.రాజారెడ్డి, రాయలచెరువు నిర్వాసిత బాధ్యత రైతులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## వైభోగంగా త్రిపురాంబికాదేవి అలంకారంలో అమ్మవారు

**- శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం,జొన్నవాడ క్షేత్రం,**
**- త్రిపురాంబికాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ కామాక్షి అమ్మవారు**




**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 12.**

జొన్నవాడలో వెలసి ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, రెండవ శ్రీ కామాక్షితాయిఅమ్మవారు"శ్రీత్రిపురాంబికాదేవి" అలంకారంలోభక్తులకునయనానంద కరంగాదర్శనమిచ్చారు. గంగవరం వాస్తవ్యులు సింగారెడ్డి లక్ష్మీనరసారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అత్యంత శోభాయమానంగా ముస్తాబైన త్రిపురాంబికా దేవిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన విశేష వస్త్రాలు, స్వర్ణాభరణాలు, వివిధ రకాల సుగంధ పుష్పాలతో చేసిన ఈ అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సకల చరాచర సృష్టికి మూలకారణమైన త్రిపురాంబికా దేవి రూపంలో అమ్మవారిని దర్శించుకుంటే సర్వ దోషాలు తొలగిపోయి, అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయని ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు వివరించారు.

ఉత్సవాల సందర్భంగా ఆలయంలో తెల్లవారుజాము నుంచే సుప్రభాత సేవ, విశేష పంచామృత అభిషేకాలు, శ్రీచక్ర నవావరణ పూజ, సాయంత్రం సామూహిక కుంకుమార్చన, తదితర ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆలయ అధికారులు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూలైన్లు, త్రాగునీరు ఏర్పాటు చేశారు. దర్శనార్థం విచ్చేసిన భక్తులందరికీ ప్రసాదాల వితరణతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

నవరాత్రి సందర్భంగా మూడవరోజు అమ్మవారు శ్రీ రక్త బీజవద అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు, భక్తులందరూ విచ్చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరుచున్నాము.

ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి శ్రీ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి దేవస్థాన ధర్మకర్త మండలి సభ్యులు జొన్నలగడ్డ వరలక్ష్మి కీలుకుప్ప శ్రీనివాసులు ముంగర సుధాకర్ ఆలయ అర్చకులు వేదపండితులు సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే లక్ష్యం-వీధి వ్యాపారులకు అండగా ప్రభుత్వం రుణ చెక్కులు, క్రెడిట్ కార్డుల పంపిణీ








**- పీఎం స్వనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలి: మంత్రి నారాయణ**

**నెల్లూరు:అక్టోబర్ 12. పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

పేదరిక నిర్మూలనతోనే రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, వీధి వ్యాపారులు ఆర్థికంగా నిలదొక్కుకుని స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. పీఎం స్వనిధి పథకం వీధి వ్యాపారుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపే గొప్ప కార్యక్రమమని పేర్కొన్నారు.నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని బార్కాస్ సెంటర్‌లో నిర్వహించిన పీఎం వీధి విక్రేతల ఆత్మనిర్భర్ స్వనిధి 2.0 కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారులకు చెక్కులు, క్రెడిట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అందిన రూ.20.46 కోట్ల ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తూ బ్యాంకుల నుంచి మరింత ఆర్థిక సహాయం పొందే అవకాశాలను పెంచుకోవాలన్నారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నారాయణ పేర్కొన్నారు. పేద కుటుంబాల ఆదాయం పెరిగి, జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే సమాజంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చిరు వ్యాపారులకు చేయూతనిస్తూ వారి ఉపాధికి భరోసా కల్పించే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు.

నిలిచిపోయిన పనులన్నీ పునఃప్రారంభం

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అవకతవకలతో వ్యవస్థలు దెబ్బతిన్నాయని, అభివృద్ధి పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం తాత్సారం చేసిందని, 2019కు ముందు ప్రారంభించిన పనులను సైతం రాజకీయ కక్షతో నిలిపివేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి, వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

పేదల అభ్యున్నతిని అడ్డుకోవద్దు

ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసతులతో అభివృద్ధి చేస్తుంటే వైసీపీ నేతలు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని నారాయణ ఆరోపించారు. పేదలకు శాశ్వత హక్కులు కల్పించేలా పట్టాలు పంపిణీ చేస్తుంటే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నెల్లూరులో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు.

విమర్శలు, అడ్డంకులు ఎన్ని ఎదురైనా పేదల అభ్యున్నతి కోసం తాను చేయాలనుకున్న పనులను చేసి తీరుతానని మంత్రి స్పష్టం చేశారు. ప్రతిపక్షాల తీరును ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు మేయర్ దేవరకొండ సుజాత, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, టౌన్ డీఎస్పీ దీక్ష, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, కార్పొరేటర్లు కరీముల్లా, రామకృష్ణ, డివిజన్ నాయకులు ఏడుకొండలు, పిట్టి సత్యనారాయణ, హరికృష్ణ, అశోక్, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు మున్సిపల్ చైర్మన్ పీఠం.. ఎస్టీ మహిళకు రిజర్వేషన్!

**-పురపాలక ఎన్నికలకు రాజకీయ పార్టీల సన్నద్ధం..**
**-చైర్‌పర్సన్ పదవిపై ఆశలు పెట్టుకున్న జనరల్ అభ్యర్థుల్లో నిరాశ**




**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,12:**

గూడూరు పురపాలక సంఘం ఎన్నికలు దశాబ్ద కాలం తర్వాత జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం విలీన గ్రామాల పంచాయతీలతో కలిపి సిద్ధం చేయడంతో

గూడూరు పురపాలక సంఘ ఎన్నికలకు రాజకీయ పార్టీలు సమాయత్తమవుతున్న నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని ఎస్టీ మహిళకు కేటాయించడం పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తూ ఇప్పటివరకు రాజకీయంగా పావులు కదిపిన పలువురు జనరల్ కేటగిరీ ఆశావహులకు ఈ రిజర్వేషన్ నిరాశ కలిగించింది. మరోవైపు, ఎస్టీ మహిళా అభ్యర్థులకు చైర్‌పర్సన్ పదవిని అధిరోహించే అవకాశం లభించడంతో ఆయా వర్గాల్లో రాజకీయ ఆసక్తి పెరిగింది.

-ఎన్నికలకు రాజకీయ పార్టీల కసరత్తు

గూడూరు పురపాలక సంఘ ఎన్నికల నిర్వహణపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సన్నద్ధతపై దృష్టి సారిస్తున్నాయి. పట్టణంలో తమ పార్టీ బలాబలాలను అంచనా వేయడం, గెలుపు అవకాశాలున్న అభ్యర్థులను గుర్తించడం, వార్డులవారీగా రాజకీయ సమీకరణాలను రూపొందించడం వంటి అంశాలపై నేతలు దృష్టి పెట్టే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల షెడ్యూల్, ఇతర అధికారిక ప్రక్రియలకు అనుగుణంగా పార్టీలు తమ కార్యాచరణను వేగవంతం చేసే అవకాశముంది.

-జనరల్ ఆశావహులకు ఎదురుదెబ్బ!

గూడూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిపై చాలాకాలంగా ఆశలు పెట్టుకున్న జనరల్ కేటగిరీ నాయకులకు ఎస్టీ మహిళకు రిజర్వేషన్ కేటాయింపు కీలక పరిణామంగా మారింది. తమ రాజకీయ అనుభవం, ప్రజల్లో ఉన్న పరిచయాలు, పార్టీ నాయకత్వంతో ఉన్న సంబంధాల ఆధారంగా చైర్‌పర్సన్ పదవిని ఆశించిన వారికి తాజా కేటాయింపుతో ఆ అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆయా నాయకులు తమ రాజకీయ భవిష్యత్తుపై తదుపరి నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అయితే, చైర్‌పర్సన్ పదవిని ఆశించిన వారిలో కొందరు తమ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించేందుకు కౌన్సిలర్ స్థానాలపై దృష్టి సారించే అవకాశముంది. పార్టీలు కూడా అనుభవజ్ఞులైన నాయకులకు ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

-ఎస్టీ మహిళా అభ్యర్థుల చుట్టూ రాజకీయ చర్చ

చైర్‌పర్సన్ పదవి ఎస్టీ మహిళకు కేటాయించడంతో ఆయా రాజకీయ పార్టీల్లో అర్హులైన మహిళా అభ్యర్థుల ఎంపిక కీలకంగా మారనుంది. పార్టీకి విధేయత, స్థానికంగా ప్రజలతో ఉన్న సంబంధాలు, రాజకీయ నేపథ్యం, ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి వంటి అంశాలు అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ మద్దతుతో ఎస్టీ మహిళా అభ్యర్థిని చైర్‌పర్సన్ స్థానంలో నిలబెట్టేందుకు వ్యూహాలు రూపొందించే పరిస్థితి కనిపిస్తోంది.

మరోవైపు, చైర్‌పర్సన్ పదవి కోసం పోటీ పడే అభ్యర్థుల విషయంలో పార్టీల అంతర్గత చర్చలు, స్థానిక నాయకుల అభిప్రాయాలు, సామాజిక సమీకరణాలు కీలక పాత్ర పోషించనున్నాయి. అధికారిక అభ్యర్థుల ప్రకటన వెలువడిన తర్వాతే ఆయా పార్టీల వైఖరిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

వార్డుల రాజకీయాలపైనా ప్రభావం

చైర్‌పర్సన్ పదవి రిజర్వేషన్ ప్రభావం కేవలం ఒక్క పదవికే పరిమితం కాకుండా వార్డుల స్థాయిలోనూ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. చైర్‌పర్సన్ అభ్యర్థికి మద్దతుగా నిలిచే బృందాన్ని ఏర్పాటు చేసుకోవడం, అనుకూలమైన కౌన్సిలర్ అభ్యర్థులను ఎంపిక చేయడం, స్థానిక నాయకుల మధ్య సమన్వయం సాధించడం వంటి అంశాలపై పార్టీలు దృష్టి సారించాల్సి ఉంటుంది.

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బలమైన నాయకత్వం ఉన్నవారికి పార్టీలు ప్రాధాన్యం ఇస్తాయా? కొత్తవారికి అవకాశాలు కల్పిస్తాయా? ఇప్పటికే రాజకీయ అనుభవం ఉన్నవారికే టికెట్లు కేటాయిస్తాయా? అనే అంశాలు చర్చకు వస్తున్నాయి. రిజర్వేషన్ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో మార్పులు చోటుచేసుకునే అవకాశముంది.

అధికారిక ప్రకటనలపై ఆసక్తి

గూడూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఎస్టీ మహిళకు కేటాయింపుతో పట్టణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేచింది. జనరల్ కేటగిరీ ఆశావహులు ప్రత్యామ్నాయ అవకాశాలపై దృష్టి సారిస్తుండగా, ఎస్టీ మహిళా అభ్యర్థులు చైర్‌పర్సన్ పదవికి పోటీ చేసే అవకాశాలపై ఆసక్తి కనబరుస్తున్నారు.

అయితే, ఎన్నికల నిర్వహణ, వార్డుల రిజర్వేషన్లు, అభ్యర్థుల అర్హతలు, పార్టీ అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై సంబంధిత అధికారిక ప్రకటనల ఆధారంగానే పూర్తి స్పష్టత రానుంది. ఈ పరిణామాల నేపథ్యంలో గూడూరు మున్సిపల్ ఎన్నికలు స్థానిక రాజకీయాల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలు ఎవరికి అవకాశం కల్పిస్తాయి? చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎవరిని బరిలోకి దింపుతాయి? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

## శ్రీకాళహస్తి వార్డుల పునర్విభజన అశాస్త్రీయం!

**- ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని పునఃపరిశీలించాలి**
**- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన అంజూరు తారక శ్రీనివాసులు**





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 12:**

శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో ప్రస్తుతం ఉన్న 35 వార్డులను 44 వార్డులుగా పెంచుతూ చేపట్టిన పునర్విభజన ప్రక్రియపై వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వార్డుల పునర్విభజనలో భౌగోళిక పరిస్థితులు, ప్రజల సౌకర్యాలు, ఓటర్లకు కలిగే ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. ఈ మేరకు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు నేతృత్వంలో మాజీ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ కె.వి. కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

**ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ,**

వార్డుల పునర్విభజన శాస్త్రీయ పద్ధతిలో, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా జరగాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ప్రస్తుతం చేపట్టిన పునర్విభజనలో కొన్ని ప్రాంతాలను సంబంధం లేని దూరప్రాంతాల వార్డుల్లో కలపడం వల్ల ఓటర్లు అయోమయానికి గురయ్యే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

1వ వార్డు ప్రాంతాలను 42వ వార్డులో కలపడంపై అభ్యంతరం

1వ వార్డు పరిధిలోని వి. మం. పల్లి, కేమంపల్లి, జైహింద్‌పురం తదితర ప్రాంతాల్లో సుమారు 1,694 ఓట్లు ఉన్నాయని అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. వార్డుల పునర్విభజనలో ఓటర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని, ఈ ప్రాంతాలను సమీపంలోని 2వ వార్డులో కలిపి ఉంటే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేదని అభిప్రాయపడ్డారు. అయితే, ఈ ప్రాంతాలను దూరంగా ఉన్న బి.పి. అగ్రహారం పరిధిలోని 42వ వార్డులో కలపడం సమంజసం కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

కైలాసగిరి కాలనీని తుఫాన్ సెంటర్‌తో కలపడంపై ప్రశ్నలు

కొండ అవతల ఉన్న కైలాసగిరి కాలనీని తుఫాన్ సెంటర్‌తో అనుసంధానం చేస్తూ ఒకే వార్డుగా ఏర్పాటు చేయడం వల్ల భౌగోళికంగా, స్థానికంగా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల మధ్య ఉన్న భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వార్డుల విభజన చేపట్టడం సరైన విధానం కాదని అన్నారు.

మద్రాసు రోడ్డు ప్రాంతాన్ని పిచ్చాటూరు రోడ్డుతో కలపడంపై అభ్యంతరం

మద్రాసు రోడ్డులో ఉన్న తంగిడిపాలెం ప్రాంతాన్ని పిచ్చాటూరు రోడ్డులోని రాజీవ్‌నగర్‌తో కలిపి ఒకే వార్డుగా ఏర్పాటు చేయడంపైనా ఆయన అభ్యంతరం తెలిపారు. వేర్వేరు మార్గాల్లో ఉన్న ప్రాంతాలను ఒకే వార్డులో చేర్చడం వల్ల స్థానిక ప్రజలకు పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఒక ప్రాంతానికి చెందిన ఓటర్లను దూరంగా ఉన్న మరో వార్డులోకి మార్చడం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వార్డుల విభజనలో స్థానిక పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలు, ఓటర్ల సౌకర్యాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

ప్రజల అభ్యంతరాలను పరిశీలించి న్యాయం చేయాలి

వార్డుల పునర్విభజనపై ఆయా ప్రాంతాల ప్రజలు, స్థానిక నాయకులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను లిఖితపూర్వకంగా మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన మార్పులు చేపట్టాలని కోరారు. వార్డుల పునర్విభజన ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా న్యాయబద్ధమైన విధానాన్ని అనుసరించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి, స్థానిక ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ వార్డుల సరిహద్దులను పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆర్కాట ముత్తు, మహబూబ్ బాషా, కంట ఉదయ్ కుమార్, పసల సుమతి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్ర రాజు, శ్రీవారి సురేష్, పటాన్ ఫరీద్, గోర, మైనంపాటి మస్తాన్, సాధనమున్న రాయల్, ఆర్కాట్ శంకర్, బాల్ శెట్టి చంద్రశేఖర్, గఫూర్, లీల, ముని కృష్ణారెడ్డి, ఫజల్, షేక్ అస్లాం, ఆశా కిరణ్, ఆరిఫ్, గుణ, ప్రకాష్, పుట్టు హరినాథ్, జూమ్లేష, సాదిక్, గాదిపాకుల కిరణ్, కన్నా, సునీల్, మణికంఠ, బాబాజీ, బషీర్, జిలాని, దేవి, సాగర్ బి, షర్మిల ఠాకూర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డుల పునర్విభజనపై తమ అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## పేదలకు సొంతింటి కల సాకారం: మంత్రి నారాయణ

**- 332 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, చీరలు పంపిణీ చేసిన మంత్రి నారాయణ దంపతులు**
**- గత వైసీపీ ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసింది..మంత్రి నారాయణ ధ్వజం**
**- మార్చి 31 నాటికి టిడ్కో ఇళ్ల పూర్తి లక్ష్యం: మంత్రి నారాయణ**
**- వైసిపి గొడ్డలి పార్టీ పై తీవ్ర విమర్శలు చేసిన మంత్రి**





**నెల్లూరు అక్టోబర్ 12 పెన్ పవర్ నెల్లూరు బ్యూరో**

పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నెల్లూరులో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అత్యంత పారదర్శకంగా హై-క్వాలిటీ ఇళ్లను అందిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ముందుగా నెల్లూరు వెంకటేశ్వరపురంలో జరిగిన టిడ్కో గృహాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి నారాయణ వారి సతీమణి పొంగూరు రమాదేవికి పూలవర్షం కురిపించి స్థానిక ప్రజాలు నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం టిడ్కో ఇళ్లను గృహప్రవేశం చేసి ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ గొడ్డలి పార్టీ ప్రభుత్వం వచ్చి గతంలో తాము శాంక్షన్ చేసిన 7 లక్షల ఇళ్లను 2,61,000కి కుదించి, రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని, కేంద్రం డబ్బులు ఇస్తామన్నా ఇళ్లు కట్టకుండా వెనక్కి పంపి ఇళ్లను, కలర్స్‌ను సర్వనాశనం చేసిందని మంత్రి నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన పనుల కోసం అదనంగా 4,500 కోట్లు కేటాయించి, వచ్చే మార్చి 31 నాటికి ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు హ్యాండ్ఓవర్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే నెల్లూరు నగరంలో వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లో గతంలో రద్దై ఖాళీగా ఉన్న ఫ్లాట్లను గుర్తించి, నేడు మొత్తం 332 మంది లబ్ధిదారులకు సుమారు 35 కోట్ల విలువైన ఇళ్ల పట్టాలతో పాటు మిఠాయిలు, చీరలు పంపిణీ చేశారు. ఇందులో నగరపాలక సంస్థ తరపున 155 ఇళ్లను పూర్తిగా ఉచితంగా ఒక్క రూపాయి కాంట్రిబ్యూషన్ లేకుండా అందిస్తుండగా, మెప్మా పరిధిలోని తొలి విడత 177 ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల వాటాగా కేవలం 85 లక్షలు చెల్లించారని, వీరికి 8 కోట్ల రుణాలు త్వరలోనే ఇప్పించి ఒక్కో యూనిట్ విలువ12 లక్షలతో పూర్తి చేయిస్తామని వెల్లడించారు. ఇప్పటివరకు నెల్లూరు అర్బన్ లోకల్ బాడీ పరిధిలో 1,724 మందికి రుణాల మంజూరు పూర్తికాగా, మిగిలిన 1,156 ఖాళీ ఫ్లాట్లను కూడా ఎన్ఎంసీ, మెప్మా సమన్వయంతో అర్హులకు పారదర్శకంగా కేటాయిస్తామని, అలాగే 900 కోట్లతో పాఠశాలలు, ఆసుపత్రులు, కమ్యూనిటీ హాల్స్ మరియు నెల్లూరు కార్పొరేషన్‌లో 23 స్కూళ్లను హై-క్వాలిటీతో అభివృద్ధి చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయని మంత్రి తెలిపారు. తన తండ్రి ప్రైవేట్ బస్ కండక్టర్ అని, హరినాథపురంలోని పూరి గుడిసెలో కష్టపడి చదువుకున్న తనకు పేదల కష్టాలు పూర్తిగా తెలుసునని, అందుకే పేదలకు ఏ విషయంలోనూ అన్యాయం జరగకుండా విదేశీ షీర్‌వాల్ టెక్నాలజీతో, ఏ-గ్రేడ్ టైల్స్, గ్రానైట్, కబోర్డ్స్, టీక్ వుడ్ డోర్లు మరియు కోటి రూపాయలతో ప్రత్యేక పార్కులతో హై-క్వాలిటీ ఇళ్లను కట్టిస్తున్నామని పేర్కొంటూ రేపు సాయంత్రంలోపు కాంపౌండ్ లోపల చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిట్కో ఎండి సునీల్ కుమార్ రెడ్డి,మేయర్ దేవరకొండ సుజాత,కమిషనర్ నందన్,డిప్యూటీ డైరెక్టర్ మాధురి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ,మాజీ జడ్పీటీసీ విజేత రెడ్డి, మెప్మా పిడి కిరణ్,నేతలు జహీర్,జమీర్,తదితరులు పాల్గొన్నారు.

# బంగారం కోసం బాంబుల వర్షం.. సూడాన్ సరిహద్దులో జరిగిన దారుణం



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగారం.. ప్రపంచవ్యాప్తంగా దేశాల ఆర్థిక వ్యవస్థలకు కీలకమైన లోహం. కానీ అదే బంగారం ఇప్పుడు రెండు పొరుగు దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతోందా? సూడాన్-ఈజిప్ట్ సరిహద్దులో చోటుచేసుకున్నట్లు చెబుతున్న వైమానిక దాడులు ఈ ప్రశ్నను మరోసారి తెరపైకి తెచ్చాయి. సరిహద్దు ప్రాంతంలోని బంగారు గనులపై ఈజిప్ట్ ఫైటర్ జెట్లతో దాడులు చేసిందని సూడాన్‌కు చెందిన మానవ హక్కుల సంఘాలు ఆరోపించాయి. ఈ దాడుల్లో 72 మంది మరణించినట్లు పేర్కొన్నాయి. అయితే ఈ ఘటనపై ఈజిప్ట్ ఇంత వరకూ స్పందించలేదు.

**బంగారు గనుల చుట్టూ వివాదం**

సూడాన్, ఈజిప్ట్ మధ్య సరిహద్దు వివాదం కొత్తది కాదు. ముఖ్యంగా హలైబ్ ట్రయాంగిల్ ప్రాంతం చాలా కాలంగా ఇరు దేశాల మధ్య విభేదాలకు కేంద్రంగా ఉంది. ఈ ప్రాంతంపై రెండు దేశాలకూ హక్కుల విషయంలో భిన్నమైన వాదనలు ఉన్నాయి. భౌగోళికంగా కీలకమైన ఈ ప్రాంతం సహజ వనరుల పరంగానూ ప్రాధాన్యం కలిగి ఉంది.ఇక్కడి బంగారు గనుల విషయంలోనూ వివాదాలు కొనసాగుతున్నాయి. హలైబ్ ట్రయాంగిల్ ప్రాంతంలో సూడాన్‌కు చెందిన వ్యక్తులు అక్రమంగా బంగారం తవ్వుతున్నారని ఈజిప్ట్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే గనులను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు జరిగినట్లు సూడాన్ మానవ హక్కుల సంఘాలు చెబుతున్నాయి. అయితే దాడుల్లో 70 మంది వరకూ చనిపోయినట్లు సమాచారం. దీంతో ప్రపంచవ్యాప్తగా దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది.

**సహజ వనరులే సంఘర్షణలకు కారణమవుతున్నాయా?**

ప్రపంచవ్యాప్తంగా చమురు, బంగారం, ఖనిజ సంపద అధికంగా ఉన్న ప్రాంతాల్లో భూభాగ హక్కులు, వనరుల నియంత్రణ వంటి అంశాలు తరచూ వివాదాలకు దారితీస్తుంటాయి. బంగారు గనుల ద్వారా లభించే ఆదాయం స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఉపయోగపడటమే కాకుండా అక్రమ తవ్వకాలు జరిగితే భద్రతాపరమైన సమస్యలకూ కారణమవుతుంది.సూడాన్-ఈజిప్ట్ సరిహద్దులోని తాజా ఘటనపై వచ్చిన ఆరోపణలు కూడా ఈ కోణంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకవైపు సరిహద్దు నియంత్రణ, మరోవైపు సహజ వనరులపై ఆధిపత్యం.. ఈ రెండు అంశాలు కలిసినప్పుడు ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది.

**72 మంది మృతి.. ఇంకా స్పష్టత రావాల్సిందే!**

ఫైటర్ జెట్ల దాడుల్లో 72 మంది మరణించారన్నది ప్రస్తుతం సూడాన్‌కు చెందిన మానవ హక్కుల సంఘాలు వెల్లడించిన సమాచారం. ఈజిప్ట్ అధికారికంగా స్పందించకపోవడంతో పీఠముడి నెలకొంది. మరోవైపు సరిహద్దు వివాదం మరింత ముదిరితే దాని ప్రభావం స్థానిక ప్రజల భద్రతతో పాటు ఇరు దేశాల సంబంధాలపైనా పడే అవకాశం ఉంటుంది. అందువల్ల ఆరోపణలపై పారదర్శక విచారణ, వాస్తవాల నిర్ధారణ, దౌత్యపరమైన చర్చలు కీలకంగా మారనున్నాయి.

**బంగారం విలువ కంటే ప్రాణాల విలువ ముఖ్యం**

బంగారు గనులపై ఎవరి నియంత్రణ ఉండాలన్నది రాజకీయ, భౌగోళిక అంశం కావచ్చు. కానీ అలాంటి వివాదాలు ప్రాణనష్టానికి దారితీస్తే మానవతా కోణం ముందుకు వస్తుంది. సూడాన్-ఈజిప్ట్ సరిహద్దులో 72 మంది మరణించారన్న ఆరోపణలు నిజమైతే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. సహజ వనరులపై హక్కుల వివాదాలకు సైనిక చర్యలే పరిష్కారమా? లేక చర్చలు, ఒప్పందాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చా? ఈ ప్రశ్నలకు ఇరు దేశాల తదుపరి స్పందనలే సమాధానం చెప్పనున్నాయి.

# రాయలసీమలో మూడు కార్పొరేషన్లు.. వైసీపీలో కొత్త ఆశలు



**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక ఎన్నికలపై వైసీపీలో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రత్యక్ష విధానంలో మేయర్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తమకు అనుకూలిస్తుందని వైసీపీ సీనియర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రాయలసీమ ప్రాంతంలోని వైసీపీ పునాదులు బలంగా ఉన్న నగరాలు, పట్టణాల్లో తమ సత్తా చాటుతామని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో గెలుపుతో 2024 అసెంబ్లీ ఎన్నికల ఓటమిని అధిగమించాలని భావిస్తోంది. దీంతో అంతర్గతంగా పెద్ద కసరత్తే చేస్తోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా గెలుపు అవకాశాలను విశ్లేషిస్తూ కార్యకర్తల నుంచి వివరాలు సేకరిస్తోంది.

రాష్ట్రంలో 17 కార్పొరేషన్లు ఉండగా, రాయలసీమలోని 3 కార్పొరేషన్లపై వైసీపీలో పూర్తిస్థాయిలో ధీమా వ్యక్తమవుతోందని చెబుతున్నారు. దాదాపు ప్రతి చోటా గట్టి పోటీ ఇచ్చినప్పటికీ ఆ మూడు చోట్ల అధికార కూటమి కంటే తాము మెరుగ్గా ఉన్నామని వైసీపీ నేతలు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రాయలసీమ ప్రాంతంలోని మెజార్టీ మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత జగన్మోహనరెడ్డి ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తమ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని వైసీపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బలంగా ఉందన్న ప్రచారం నేపథ్యంలో రాయలసీమలోని మూడు కార్పొరేషన్లు, పలు మున్సిపాలిటీలపై వైసీపీలో కనిపిస్తున్న ధీమా రాజకీయంగా ఆసక్తి రేపుతోందని అంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత ఇలాకా అయిన కడప నగరపాలక సంస్థతోపాటు పక్కనే ఉన్న కర్నూలు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లను సునాయాశంగా గెలుచుకుంటామని వైసీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. ఈ మూడు చోట్ల ఎమ్మెల్యేల పనితీరు, కూటమిలో అంతర్గత కలహాలు తమకు మేలు చేస్తాయని భావిస్తున్నారు.

కడపలో స్థానిక ఎమ్మెల్యే మాధవీరెడ్డిని టీడీపీ నాయకులే వ్యతిరేకిస్తున్నారని, పైగా ఇక్కడ ముస్లిం మైనార్టీ ఓట్లు తమకు కలిసి వస్తాయని ఊహిస్తున్నారు. ఇక కర్నూలు, తిరుపతిలో బలమైన కేడర్ సహకారంతో ఈజీగా గట్టెక్కుతామని వైసీపీ నాయకులు ధీమాగా ఉన్నారని చెబుతున్నారు. కర్నూలులో కూడా మైనార్టీ ఓట్లు భారీగా ఉండటంపై వైసీపీ నేతలు ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. వీటికి తోడు తమకు సంస్థాగతంగా ఉన్న బలం కూడా తమకు గెలుపు అవకాశాలను మెరుగు పరిచే అవకాశం ఉందని భావిస్తున్నారు. అంతేకాకుండా కర్నూలు నగరం పరిధిలో ఉన్న కొడుమూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం కూడా కలిసివస్తుందని అంటున్నారు.

మరోవైపు తిరుపతి విషయంలోనూ వైసీపీలో ధీమా కనిపిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే భూమన వంటి బలమైన నేత తమకు అడ్వాంటేజ్ అవుతారని వైసీపీ భావిస్తోంది. భూమన స్థాయి నేత కూటమిలో లేకపోవడం కూడా తమకు కలిసివస్తుందని అంటున్నారు. తిరుపతిలో జనసేన ఎమ్మెల్యే స్థానికేతరుడు కావడం, టీడీపీకి గత రెండేళు ్లగా ఇంచార్జి లేకపోవడం వల్ల వైసీపీ దూకుడు ఎక్కువగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఇవన్నీ వైసీపీ కలలు కంటోందని రాష్ట్రంలో తమ బలం మరింత పెరిగిందని కూటమి నేతలు కూడా ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి రాయలసీమలోని మూడు కార్పొరేషన్లపై వైసీపీ చూపిస్తున్న ఉత్సాహం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

# విజయ నగరంలో వైసీపీకి వరస దెబ్బలు

**విజయనగరం, ,అక్టోబరు 12 పెన్ పవర్:** విజయనగరం జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుసగా కీలక నేతలను కోల్పోతూ భారీ షాక్‌లను ఎదుర్కొంటోంది. ఇటీవలే పార్టీ సీనియర్ నేత, బొత్స సత్యనారాయణ బంధువు అయిన మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేయగా, ఆయన వెంటే పలువురు జడ్పీటీసీలు కూడా పార్టీని వీడారు.ఆ దెబ్బ నుంచి కోలుకోకముందే పార్టీకి చెందిన మరికొందరు ముఖ్య నేతలు వరుసగా రాజీనామాలు చేస్తుండటంతో జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఖాళీ అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, విజయనగరం జడ్పీ మాజీ చైర్మన్ బడ్డుకొండ అప్పలనాయుడు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారు. పార్టీ అధిష్ఠానం ఆయనను సస్పెండ్ చేసిన కొన్ని గంటల్లోనే ఆయన తన రాజీనామాను ప్రకటించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని, పార్టీని ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా మార్చేశారని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. మరొకవైపు కోలగట్ల వీరభద్రస్వామి కూడా పార్టీ మారతారని వినిపించినా ఆయన ఆ ప్రచారాన్ని కొట్టిపారేశారు. తాను కొంత కాలం నుంచి విశాఖలో ఉన్నంత మాత్రాన పార్టీని వీడుతారన్న ప్రచారం సరైనది కాదని ఆయన కొట్టిపారేశారు. తనకు ఇప్పుడు అరవై ఐదేళ్లని, తాను ఇప్పుడు పార్టీ మారి ఏం చేస్తానని ఆయన నవ్వుతూ అనడం కూడా చర్చనీయాంశమైంది. అయితే గతంలో అధికారంలో ఉన్నప్పుడు తన కుమార్తెను మేయర్ పదవికి పోటీ చేయాలని ప్రయత్నించి, ఇప్పుడు ఓటమి చెందిన తర్వాత తాము కొత్తవారికి అకాశం ఇవ్వాలని కోలగట్ల అనడం చర్చనీయాంశమైంది. కోలగట్ల వీరభద్రస్వామి నిజానికి పార్టీని వీడకపోవచ్చు. ఆయన వైసీపీలో ఉండే అవకాశాలు ఉండి ఉండవచ్చు. కానీ ఆయన సమావేశంలో మాట్లాడిన తీరు మాత్రం వైసీపీ నేతలు ఎవరైనా వెళితే సాధారణమేనని కొట్టిపారేయడం కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. బెల్లం ఉన్న చోటకే ఈగలు ముసురుతాయని, గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నుంచి అనేక మంది నేతలు తమ పార్టీలోకి వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ అన్న మాటలు తాను ఎవరు పార్టీని వదిలి వెళ్లినా పట్టించుకోనని మాత్రమే చెప్పినట్లయింది. .. కేవలం విజయనగరం ప్రాంతంలోనే కాదు. బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాల్లో భారీ చేరికలు టీడీపీ, జనసేనలో ఉంటాయన్న ప్రచారం నడుస్తుంది. అక్టోబర్



మొదటి వారంలో బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు పార్టీకి గుడ్ బై చెప్పారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కళా వెంకటరావు సమక్షంలో పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ లో చేరారు.జిల్లాలోని పలు మండలాల్లో ఒకేరోజు వందలాది కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి దూరమై కూటమి పార్టీల వైపు మొగ్గు చూపుతుండటంతో విజయనగరంలో వైఎస్సార్‌సీపీ మరింత బలహీనపడుతోంది. ఇక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎక్కువ మంది ద్వితీయ శ్రేణి నేతలు వైసీపీకి దూరమవుతారన్న ప్రచారం జరుగుతోంది. బొత్స సత్యనారాయణవంటి సీనియర్ నేతలున్న ఈ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నేతలు దూరమవుతుండటంతో కొంత ఇబ్బందికరమైన పరిణామమే. అయితే నేతలు వెళ్లినంత మాత్రాన ఓటు బ్యాంకు మాత్రం చెక్కు చెదరదన్న ధీమాలో వైసీపీ నేతలున్నారు. మరి ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్నది చూడాలి.స్థలాలు చూడండి

# పెద్దపులిని పట్టుకునేందుకు పూణే నుంచి టీమ్స్

**కొవ్వూరు అక్టోబరు 12 పెన్ పవర్:** తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలో పెద్దపులి సంచారం స్థానికంగా కలకలం సృష్టించింది. దేచర్ల సమీపంలోని క్వారీ వద్ద పెద్దపులి తిష్ట వేయడంతో ప్రజలు, రైతులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఆ క్వారీ వద్దే సేదతీరుతున్న పులిని ఎలాగైనా బంధించేందుకు అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. పులిని బంధించేందుకు రెస్క్యూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నారు.పులికి ఎలాంటి హాని కలగకుండా, అలాగే సిబ్బందికి ప్రమాదం జరగకుండా దాన్ని బంధించేందుకు అటవీ శాఖ అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. కొవ్వూరు ప్రాంతంలో పులి సంచారం దృష్ట్యా స్థానిక ప్రజలు, సమీప గ్రామాల రైతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను ఖచ్చితంగా పాటించాలని అటవీ శాఖ విజ్ఞప్తి చేసింది.గోదావరి జిల్లాలో పెద్దపులి దోబూతులాడుతోంది. చాలా రోజులుగా అటవీ శాఖను ముప్పుతిప్పలు పెడుతున్న పులి.. ఇప్పుడు చాగల్లు అరటితోటల్లో సంచరిస్తోంది. కొన్నాళ్లుగా పాపికొండల అభయారణ్యంలో తిరిగిన పులి కొన్ని రోజుల కిందట సీతానగరం వద్ద గోదావరి నదిని దాటింది. దేవరపల్లి మీదుగా ఇప్పుడు డెల్టా ప్రాంతానికి వచ్చేయడంతో అటవీ అధికారుల్లో ఆందోళన పెరిగింది. పులిని సాధ్యమైనంత త్వరగా బంధించేందుకు పూణె నుంచి ప్రత్యేక టీమ్‌ను రప్పించారు.ఈ క్రమంలో శనివారం ఉదయం పులి చాగల్లు సమీపంలోని ఓ అరటితోటలో రైతులకు కనిపించింది. ఆ తర్వాత ఓ ప్యాక్టరీ సమీపంలో పులి సేదతీరుతున్నట్లు కెమెరాలకు చిక్కింద. పులి అనుసరిస్తున్న వ్యూహం అటవీశాఖ అధికారులను ఆశ్చర్యపరుస్తోంది. పగటిపూట కోకో తోటలు, వరి పొలాల్లో నక్కుతూ, చీకటి పడగానే ఊర్లు మారుతూ హడలెత్తిస్తోంది. పులి కదలికలను అటవీ శాఖ అధికారులు ఛాలెంజ్‌గా తీసుకుని.. రేడియో కాలర్ సిగ్నల్స్, ప్రత్యేక డ్రోన్ కెమెరాల ద్వారా దాని జాడను ట్రాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక మత్తు ఇంజెక్షన్ నిపుణుల బృందం కూడా పులిని బంధించే ఆపరేషన్‌లోకి దిగింది. పూణె టీమ్ మాత్రం సాధ్యమైనంత త్వరగా పులిని పట్టుకుంటామని చెప్పి ఒకరోజు పూర్తయిందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

## ఎమ్మెల్యే బాలరాజు సెటిల్మెంట్

**పవన్ కల్యాణ్ సీరియస్.. అవినీతి ఆరోపణలపై విచారణకు ఆదేశం**

**పోలవరం,అక్టోబరు 12 పెన్ పవర్:** పోలవరం జనసేన ఎమ్మెల్యే బాలరాజు సెటిల్మెంట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తీరులో ఎలాంటి మార్పు రాలేదని, తాజాగా ఆయనపై ఇసుక మరియు మట్టి అక్రమ రవాణా సెటిల్‌మెంట్ల ఆరోపణలు రావడంతో పాటు దానికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు రావడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. దీంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. విచారణ కోసం హై లెవెల్ కమిటీని నియమించారు. గతంలో జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై అనేక ఆరోపణలు రావడంతో పవన్ కల్యాణ్ పిలిచి క్లాస్ పీకారు. తాను అమాయకుడినని, తనకు ఏ పాపం తెలియదని బాలరాజు పవన్ ముందే నటించే ప్రయత్నం చేశారు. అయితే పవర్ స్టార్‌అయిన పవన్ కల్యాణ్ హెచ్చరికలు జారీ చేసి బాలరాజును పంపేశారు. హీరో ముందే నటనలా? అంటూ సొంత పార్టీ నేతలే బుగ్గలు నొక్కుకున్నార... తాజాగా మరొక వీడియా వైరల్ అవుతుండటంతో ఆయన ఇక తప్పించుకునే వీలు లేకుండా పోయింది సెటిల్‌మెంట్ చేస్తూ లక్షల రూపాయలు పంచి పెడుతున్న బాలరాజు వైఖరిపై సొంత పార్టీ నేతలే ఈ వీడియో ను లీక్ చేసినట్లు అర్థమవుతుంది. ఆయన ఇంట్లో నింపాదిగా స్థానిక నాయకులతో కలసి టీ తాగుతూ సెటిల్ మెంట్ చేస్తున్న వీడియో ఎమ్మెల్యే పరిస్థితికి అద్దం పడుతుంది. స్థానిక నాయకుల మధ్య ఇసుక, మట్టి అక్రమ రవాణా పంపకాల గొడవలు వీధికెక్కగా, స్వయంగా ఎమ్మెల్యే బాలరాజు లక్షలాది రూపాయల 5 లక్షల నుండి రూ. 21 లక్షల వరకు డీలింగ్స్ గురించి మాట్లాడిన ఆడియోతో కూడిన వీడియో బయటపడింది. ఎవరెవరికి ఎంత ఇవ్వాలని బాలరాజు చెప్పడం కూడా వీడియోలో వినిపించడంతో పార్టీ పరువు పోలవరం ప్రవాహంలా ఆ ప్రాంతంలో పారినట్లయింది. చిర్రి బాలరాజు తాజా వీడియో బయటకు రావడంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కమిటీని నియమించారు. ఎమ్మెల్యే వ్యవహారశైలిపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై విచారణ జరిపేందుకు పార్టీ తరఫున ఒక హైలెవల్ కమిటీని కూడా నియమించారు. గతంలోనూ ఆయనపై పలు ఆరోపణలు రాగా, తాజాగా వెలుగు చూసిన ఇసుక పంచాయితీ వీడియోలు జనసేన పార్టీకి తలనొప్పిగా మారాయి. చిర్రి బాలరాజు వరసగా ఇలా వివాదాల్లో చిక్కుకోవడం, ఆయనకు సొంత పార్టీ లోనే శత్రువులు ఎక్కువగా ఉండటంతో తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. బాలరాజు ఇప్పుడు ఏం వివరణ ఇచ్చుకుంటారో తెలియదు కానీ, ఆయనకు మాత్రం పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో మరోసారి టిక్కెట్ ఇవ్వరన్న అభిప్రాయం పార్టీ నేతల్లోనే వ్యక్తమవుతుంది. ఇంత బహిరంగంగా దోపిడీ చేస్తున్న వ్యవహారాన్ని పవన్ కల్యాణ్ సీరియస్ గా తీసుకున్నారని, అయితే స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో ప్రస్తుతానికి ఎలాంటి చర్యలు ఉండకపోయినా.. భవిష్యత్ లో మాత్రం బాలరాజుకు రాజకీయంగా ఇబ్బందులు తప్పవంటున్నారు.

ఎమ్మెల్యే భార్య పెత్తనం

దీనికి తోడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే భార్య ఒక పార్టీ నాయకుడిపై దాడి చేయించారన్న ఆరోపణలు రావడం, సీనియర్ నేతలను, జనసైనికులను పక్కనపెట్టి పెత్తనం చెలాయిస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో పవన్ తీవ్ర అసహనానికి గురయ్యారు. అడవితల్లి బాట పేరిట పవన్ కల్యాణ్ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి గెలిచిన ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలు రావడం పవన్‌ను ఆగ్రహానికి గురిచేసింది. తాజాగా నియమించిన హైలెవల్ కమిటీ నియోజకవర్గంలో క్షేత్రస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించిన తర్వాత చర్యలు తీసుకోనున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు రెడీ

**ఈ 14, 15 తేదీల్లో నోటిఫికేషన్.. నవంబర్ 30 లోపు ప్రక్రియ పూర్తి**

**అమరావతి,అక్టోబరు 12 పెన్ పవర్:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. కేబినెట్ భేటీలో బీసీలకు రిజర్వేషన్లు, సీట్ల కేటాయింపులపై కీలకంగా చర్చించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇంఛార్జ్ మంత్రులదేనని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 13న అన్ని రాజకీయ పార్టీలతో ఎస్ఈసీ సమావేశం కానుందని తెలుస్తోంది. ఈ నెల 14 లేదా 15న ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. 3 దశలలో నవంబర్ 30లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎస్ఈసీ నిర్ణయం తీసుకుంది. కేబినెట్ భేటీ ముగిసిన తరువాత మంత్రులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయి వారికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా నవంబర్ 15 నాటికి ఎన్నికలు పూర్తి చేసి, రెగ్యులర్ పాలన వచ్చేలా చూద్దామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 100శాతం గెలవాలని ఆకాంక్షించారు. కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత ఇంఛార్జ్ మంత్రులదేనని, చురుకుగా వ్యవహరిస్తూ వారి విజయం సాధించేలా చూసుకోవాలని సూచించారు. ఏపీలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ, వారి రిజర్వేషన్లకు చట్టబద్ధమైన రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డెడికేటెడ్ బీసీ కమిషన్ (రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్) సమర్పించిన నివేదిక, సిఫార్సులకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ కొత్త నిర్ణయం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు లభించే స్థానాలు పెరగనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికల్లో కేవలం 33 వేల మంది బీసీలకు మాత్రమే అవకాశాలు దక్కగా, ప్రస్తుత నిర్ణయంతో గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో దాదాపు 38 వేల మందికి పైగా బీసీ ప్రజాప్రతినిధులకు పదవులు దక్కనున్నాయి. బీసీలకు గతంలో కంటే సుమారు 4 వేలకు పైగా స్థానాలు రగనున్నాయి.జిల్లాలు, వార్డులు, డివిజన్ల పునర్విభజనతో పాటు పెంపును పరిగణనలోకి తీసుకుని, జనాభా ప్రాతిపదికన ఈ రిజర్వేషన్లను అమలు చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలు మినహా ఇతర అన్ని విభాగాల పరిధిలోని దాదాపు 1.40 లక్షలకు పైగా స్థానాల్లో బీసీ రిజర్వేషన్లను వర్తింపజేసేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. స్థానిక చట్టాలు, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు భంగం వాటిల్లకుండానే బీసీలకు గరిష్ట స్థానాల్లో పోటీ చేసేలా ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. అంతేకాకుండా, సుప్రీంకోర్టు తీర్పులు, మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం రిజర్వేషన్ల శాతం 50 శాతానికి మించకుండా డెడికేటెడ్ కమిషన్ చేసిన సిఫార్సులను ఏపీ ప్రభుత్వం ఆమోదించింది. దీని ద్వారా న్యాయపరమైన చిక్కులు రాకుండా పక్కాగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఏవైనా కేటగిరీలలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం కంటే తక్కువగా ఉంటే, కూటమి పార్టీల తరఫున ఆయా పదవులను బీసీలకే కేటాయిస్తామని చంద్రబాబు ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

పెన్ పవర్
మంగళవారం 13 అక్టోబర్ 2026

# క్యాచ్‌ల వేటలో తిలక్ వర్మ అరుదైన రికార్డు.. భారత క్రికెటర్లలో టాప్!

**టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తిలక్ వర్మ అరుదైన ఘనత**
**ఫీల్డర్‌గా 50 క్యాచ్‌లు అందుకున్న ఐదో భారత ఆటగాడు**
**కేవలం 68 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు**
**ప్రతి ఇన్నింగ్స్‌కు సగటున 0.757 వికెట్లను క్యాచ్‌ల రూపంలో అందించిన తిలక్**
**0.767 నిష్పత్తితో తిలక్ కంటే ముందున్న యూఏఈ ప్లేయర్ వసీమ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత యువ బ్యాటర్ తిలక్ వర్మ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. ఫీల్డర్‌గా 50 క్యాచ్‌లు అందుకున్న ఐదో భారత ఆటగాడిగా నిలిచాడు. అంతేకాదు.. ఈ మైలురాయిని అత్యంత సమర్థంగా చేరుకున్న భారత ఫీల్డర్‌గా రికార్డు సృష్టించాడు. వెస్టిండీస్‌తో ఆదివారం ఇండోర్‌లో జరిగిన మూడో టీ20లో ఈ ఘనత అందుకున్నాడు.

**68 మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు**

తిలక్ వర్మ కేవలం 68 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనే 50 క్యాచ్‌లు పట్టాడు. ప్రతి ఇన్నింగ్స్‌కు సగటున 0.757 వికెట్లను క్యాచ్‌ల రూపంలో అందించడంలో అతడు ముందున్నాడు. కనీసం 50 ఔట్‌ఫీల్డ్ క్యాచ్‌లు అందుకున్న భారత ఆటగాళ్లలో ఇదే అత్యుత్తమ నిష్పత్తి. ప్రపంచవ్యాప్తంగా ఈ జాబితాలో

యూఏఈ ఆటగాడు మహమ్మద్ వసీమ్ మాత్రమే తిలక్ కంటే ముందున్నాడు. వసీమ్ 99 మ్యాచ్‌ల్లో 76 క్యాచ్‌లు అందుకుని 0.767 నిష్పత్తితో అగ్రస్థానంలో ఉన్నాడు.

**భారత దిగ్గజాల సరసన చోటు**

టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక క్యాచ్‌లు అందుకున్న ఆటగాళ్ల జాబితాలో తిలక్ ఐదో స్థానంలో నిలిచాడు. రోహిత్ శర్మ 65 క్యాచ్‌లతో అగ్రస్థానంలో ఉండగా.. హార్దిక్ పాండ్యా 64, సూర్యకుమార్ యాదవ్ 58, విరాట్ కోహ్లీ 54 క్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇప్పుడు తిలక్ 50 క్యాచ్‌లతో ఈ జాబితాలో చోటు సంపాదించాడు.

# రంజీ ట్రోఫీకి అన్యాయం.. బీసీసీఐ షెడ్యూలింగ్‌పై గవాస్కర్ అసంతృప్తి

- రంజీ ట్రోఫీ సమయంలో ఇండియా 'ఏ' మ్యాచ్‌ల నిర్వహణపై గవాస్కర్ విమర్శలు
- కీలక ఆటగాళ్లు రాష్ట్ర జట్లకు దూరమవుతున్నారని ఆవేదన
- రంజీ ట్రోఫీకి బీసీసీఐ పెద్దపీట వేయాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రంజీ ట్రోఫీకి ప్రాధాన్యత ఇవ్వకుండా, అదే సమయంలో ఇండియా 'ఏ' మ్యాచ్‌లను షెడ్యూల్ చేయడాన్ని ఆయన తప్పుబట్టాడు. ఈ విధానం వల్ల దేశవాళీ టోర్నీ ప్రాధాన్యతను బీసీసీఐయే తగ్గిస్తోందని ఆయన విమర్శించాడు.రంజీ ట్రోఫీ సీజన్ కొనసాగుతుండగా ఇండియా 'ఏ' మ్యాచ్‌లు నిర్వహించడం వల్ల చాలా మంది కీలక ఆటగాళ్లు తమ రాష్ట్ర జట్లకు అందుబాటులో ఉండటం లేదని గవాస్కర్ అన్నాడు. ఇటీవలే ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన మ్యాచ్ కారణంగా రజత్ పటిదార్, దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్ వంటి ఆటగాళ్లు తమ జట్ల తొలి రంజీ మ్యాచ్‌లకు దూరమయ్యారని గుర్తుచేశాడు. త్వరలో జరగనున్న న్యూజిలాండ్ 'ఏ' పర్యటనతో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని ఆందోళన వ్యక్తం చేశాడు."రంజీ ట్రోఫీలో అగ్రశ్రేణి ఆటగాళ్లు పాల్గొనకపోవడం వల్ల దేశవాళీ క్రికెటర్ల నిజమైన సత్తాను అంచనా వేయడం కష్టంగా మారుతోంది. రంజీల్లో రాణించిన కొందరు అంతర్జాతీయ స్థాయిలో ఇబ్బంది పడటం మనం చూస్తున్నాం" అని గవాస్కర్ పేర్కొన్నాడు. పోటీ బలహీనపడితే ఒక బ్యాటర్ 2000 పరుగులు చేయడం, బౌలర్ 100 వికెట్లు తీయడం వంటి తప్పుడు గణాంకాలు నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించాడు.అన్ని రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ప్లేట్ డివిజన్‌ను చేర్చడం వల్ల టోర్నీ మొత్తం ప్రమాణాలు తగ్గాయని కూడా గవాస్కర్ అన్నాడు. ఇండియా 'ఏ' మ్యాచ్‌లను దేశవాళీ సీజన్‌కు అడ్డంకి లేకుండా నిర్వహించాలని, రంజీ ట్రోఫీకి బీసీసీఐ పెద్దపీట వేయాలని సన్నీ సూచించాడు. గవాస్కర్ వాదనకు మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా మద్దతు పలకడం గమనార్హం.

# సచిన్, యువీ, గంభీర్‌లను ఎందుకు తప్పించామో వాళ్లకు తెలుసు: సందీప్ పాటిల్

- భారత క్రికెట్ భవిష్యత్తుకే తాము ప్రాధాన్యత ఇచ్చామన్న మాజీ చీఫ్ సెలెక్టర్
- ఆ నిర్ణయాలు తన ఒక్కడివే కావని, ఐదుగురు సభ్యుల కమిటీ సమష్టిగా తీసుకుందని వెల్లడి
- స్నేహితుడని జట్టులోకి తీసుకోలేమని, దేశ ప్రయోజనాలే ముఖ్యమని వ్యాఖ్య
- 2012-2016 మధ్య భారత జట్టులో జరిగిన మార్పులపై కీలక విషయాలు వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, యువరాజ్ సింగ్, గౌతమ్ గంభీర్, జహీర్ ఖాన్ వంటి వారిని జట్టు నుంచి ఎందుకు తప్పించాల్సి వచ్చిందో లేదా వారు ఎందుకు రిటైర్ అవ్వాల్సి వచ్చిందో ఆ కారణాలు వారికే తెలుసని భారత మాజీ క్రికెటర్, మాజీ చీఫ్ సెలెక్టర్ సందీప్ పాటిల్ తెలిపాడు. భారత క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వ్యక్తిగత సంబంధాల కంటే దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేయాల్సి వచ్చిందని స్పష్టం చేశాడు.1983 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన సందీప్ పాటిల్, 2012 నుంచి 2016 వరకు ఐదుగురు సభ్యుల సీనియర్ సెలక్షన్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించాడు. ఈ కాలంలో భారత జట్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. దూరదర్శన్‌లో ప్రసారమైన 'ది గ్రేట్ ఇండియన్ క్రికెట్ షో'లో పాటిల్ ఈ విషయాలను వెల్లడించాడు. "ముందుగా ఒకటి స్పష్టం చేయాలనుకుంటున్నాను. ఈ నిర్ణయాలు నేను ఒక్కడినే తీసుకున్నవి కావు. ఐదుగురు సభ్యుల సెలక్షన్ ప్యానెల్ ఉండేది, నేను దానికి ఛైర్మన్‌ను మాత్రమే. మేము తీసుకున్న ప్రతి నిర్ణయం భారత క్రికెట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్నదే" అని వివరించాడు.2011 వన్డే ప్రపంచకప్ విజయం తర్వాత భారత జట్టులో సమూల మార్పులు అవసరమయ్యాయి. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ ఆటగాళ్ల స్థానంలో యువ ప్రతిభకు అవకాశం కల్పించారు. "సచిన్, గంభీర్, యువరాజ్, జహీర్ వంటి గొప్ప ఆటగాళ్లు జట్టుకు దూరమవడం బాధాకరమే. కానీ, ఆ కారణాలు వారికి తెలుసు. సెలెక్టర్లుగా దేశం, బీసీసీఐ, భారత క్రికెట్ ప్రయోజనాలకు మొదటి స్థానం ఇవ్వడమే మా కర్తవ్యం" అని పాటిల్ తెలిపాడు.ఆటగాళ్లతో స్నేహం ఉండొచ్చు కానీ, వృత్తిపరమైన బాధ్యతల విషయంలో ఒక హద్దు ఉండాలని పాటిల్ అభిప్రాయపడ్డాడు. "అతడు నా స్నేహితుడు కాబట్టి జట్టులోకి తీసుకుంటాను అని చెప్పలేం. ఈ బాధ్యతను చాలా సీరియస్‌గా తీసుకోవాలి. కొన్నిసార్లు మనకు నచ్చని నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది, కానీ భారత జట్టు మంచి కోసమే వాటిని అమలు చేయాలి" అని పేర్కొన్నాడు. తమ నిర్ణయాలు దీర్ఘకాల స్నేహాలను కూడా ప్రభావితం చేశా యని, అయినా జట్టు ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశాడు.



**స్ట్రాప్‌లెస్ డెనిమ్ బాడీకాన్ డ్రెస్‌లో ఆకట్టుకుంటున్న అవికా గోర్**

# నాని స్టైల్ అదుర్స్.. 'బ్లడీ రోమియో' కోసం లుక్ ఛేంజ్!



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో దూసుకుపోతూ తన మార్కెట్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తున్నారు. ఇటీవలే విడుదలైన 'ది ప్యారడైజ్' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న నాని, వెంటనే తన తదుపరి గ్యాంగ్‌స్టర్ డ్రామా 'బ్లడీ రోమియో' కోసం సిద్ధమయ్యారు. స్టైలిష్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా కోసం నాని సూపర్ స్టైలిష్ మేకోవర్ అయ్యారు. తాజాగా పూర్తయిన ఈ ఫోటోషూట్ విశేషాలు మరియు సినిమా అప్‌డేట్స్ వీడియో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

**సుజీత్ మార్క్ వింటేజ్ అండ్ స్టైలిష్ లుక్:**

టాలీవుడ్ లో 'రన్ రాజా రన్', 'సాహో', 'ఓజీ' వంటి చిత్రాలతో తనదైన స్టైలిష్ మేకింగ్‌తో ఆకట్టుకున్న దర్శకుడు సుజీత్, ఈసారి నాని లుక్‌ను పూర్తిగా రీఇన్వెంట్ చేశారు. ఈ సినిమా కోసం నాని తన హెయిర్‌స్టైల్‌ను మార్చడంతో పాటు క్రేజీ ట్రెండీ స్పెక్స్ ధరించి సరికొత్త గ్లామరస్ అండ్ రఫ్‌గా కనిపించనున్నారు. ఇక మేకర్స్ ఇప్పటివరకు నాని పూర్తి లుక్‌ను బయటకు వదలకుండా కేవలం గ్లింప్స్‌తోనే ప్రేక్షకుల్లో అంచనాలను విపరీతంగా పెంచేశారు.

**రోమియో కిచెన్ షురూ కాబోతోంది:**

గత రెండేళ్లుగా 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్న నాని, ఇప్పుడు ఎలాంటి గ్యాప్ తీసుకోకుండా 'బ్లడీ రోమియో' సెట్స్‌లోకి అడుగుపెడుతున్నారు. అక్టోబర్ 16 లేదా 17 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. తొలి షెడ్యూల్‌లోనే కొన్ని అత్యంత కీలకమైన యాక్షన్ ఘట్టాలను చిత్రీకరించేందుకు సుజీత్ అండ్ టీమ్ పక్కా ప్లాన్‌తో సిద్ధమయ్యారు.

**నాని వైవిధ్యమైన క్యారెక్టరైజేషన్:**

ఫిల్మ్‌నగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ గ్యాంగ్‌స్టర్ అవతారంలో అలరించబోతున్నారు. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా ఒక డిఫరెంట్ షేడ్ ఉన్న చెఫ్ పాత్రలోనూ లేదా ద్విపాత్రాభినయంలోనూ ఆయన కనిపిస్తారని టాక్ నడుస్తోంది. ఒకవైపు మాస్ యాక్షన్, మరోవైపు వింటేజ్ స్టైల్స్ కలగలిపి సుజీత్ ఈ కథను ఎంతో ఆసక్తికరంగా డిజైన్ చేశారు.

**నిర్మాణంలో రాజీ పడని మేకర్స్:**

ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను వెంకట్ బోయినపల్లి నిహారిక ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ మాస్టర్ చెఫ్స్ కాంబినేషన్‌లో వస్తున్న 'బ్లడీ రోమియో' థియేటర్లలో ప్రేక్షకులకు మైండ్ బ్లాకింగ్ ఫీస్ట్ ఇవ్వడం ఖాయమని మేకర్స్ నమ్ముతున్నారు. సుజీత్ దర్శకత్వం, నాని పాత్ర ఈ సినిమాను పాన్ ఇండియా రేంజ్‌కు తీసుకెళ్తాయని భావిస్తున్నారు. 'బ్లడీ రోమియో' కోసం నాని కొత్త లుక్‌లోకి మారడం ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజ్‌గా మారింది. ఇప్పటికే విడుదలైన అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలు పెరిగాయి. నాని పూర్తి లుక్ బయటకు వస్తే ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.



**ఐవరీ రంగు తామర పువ్వుల డిజైన్ చీరలో పండుగ శోభను వెదజల్లుతున్న రీతూ వర్మ**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com